విలేకరులు కావలెను

భారత్ రిపోర్టర్ — RNI.APTEL/16364/2023 — తెలుగు దినపత్రిక — BHARATH REPORTER

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న భారత్ రిపోర్టర్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను.తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికీ, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి:

7668886666



Postal Licenced No: HDP/010/2024-2026

# భారత్

తెలుగు దినపత్రిక

BHARAT REPORTER రిపోర్టర్

BHARAT REPORTER RNI.APTEL/2023/88573 TELUGU DAILY NEWS PAPER

- సంపుటి : 03 సంచిక : 42 ఎడిటర్.. కొట్లపల్లి ఫౌజియా పేజిలు : 08, వెల . రూ. 2/- గురువారం - 16 - ఏప్రిల్ - 2026


## భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర




మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

సరిహద్దుల్లో 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల పునరుద్ధరణ

## ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్.. మరింత కచ్చితంగా, సమర్ధంగా!




చర్మ క్యాన్సర్ ముప్పును ముందే పసిగట్టనున్న ఏఐ... స్వీడన్ పరిశోధనలో వెల్లడి

స్వీడన్‌లో 60 లక్షల మంది ఆరోగ్య డేటాను విశ్లేషించిన పరిశోధకులు

సాధారణ పద్ధతుల కన్నా ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలు ఇచ్చిందని వెల్లడి

## కాల్పుల విరమణ పొడిగింపుపై డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన లేదన్న ట్రంప్




శాశ్వత ఒప్పందం వైపు తాము మొగ్గు చూపుతున్నామన్న ట్రంప్

ఒప్పందం కుదిరితేనే మంచిదని అభిప్రాయపడిన ట్రంప్



## సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం

- చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- చంద్రగిరిలో క్రీడా సంబరం
- రూ.3.17 కోట్లతో క్రీడా కేంద్రం
- మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం
- పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడిన లోకేశ్

# పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

### నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్: సీఎం చంద్రబాబు ఆదేశాలు

- ★ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ★జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- ★నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు
- ★రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు




అమరావతి: రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న మిగతా.. 2లో




## అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతాం

- దేవుడు అన్నీ చూస్తున్నాడు.. మత్స్యకారుల హక్కుల్ని చంద్రబాబు తాత కూడా తీసుకోలేరు: జగన్
- కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమన్న జగన్
- కూటమి పాలనలో మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని విమర్శ
- జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తమ హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టులు, హార్బర్లు నిర్మించామని వెల్లడి

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని,




## అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయం

- బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన
- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

హైదరాబాద్: పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ

## దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోం

- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి



హైదరాబాద్: భారత ప్రభుత్వం రేపు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ

## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం

బీహార్‌లో కొత్త శకం.. తొలి బీజేపీ సీఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు

డిప్యూటీ సీఎంలుగా విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్

రాజ్యసభకు వెళ్లిన నితీశ్ కుమార్.. నాయకత్వ మార్పునకు మార్గం సుగమం

బీహార్: బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది.



రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మిగతా.. 2లో




## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం

- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్ల పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం




## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తాం

- అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు: బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక
- డీలిమిటేషన్ బిల్లు పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- బీజేపీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శ

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. మిగతా.. 2లో

# మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

### లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలి

- నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు
- సీఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు
- అనుమానాలతో గందరగోళం సృష్టించవద్దు
- రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు



హైదరాబాద్: మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. మిగతా.. 2లో




## కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్..
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టీడీపీ
- కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం

## భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర

ఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్‌ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు. గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్‌ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్‌ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్.. మరింత కచ్చితంగా, సమర్థంగా!

ఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ప్రాణాంతక చర్మ క్యాన్సర్లలో ఒకటైన మెలనోమా ముప్పును ముందుగానే గుర్తించవచ్చని స్వీడన్‌లో జరిగిన ఒక కొత్త అధ్యయనం తేల్చింది. ఆరోగ్య వ్యవస్థల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని పరిశోధకులు బుధవారం వెల్లడించారు. ఈ అధ్యయనం కోసం స్వీడన్‌లోని దాదాపు 60 లక్షల మంది వయోజన జనాభాకు సంబంధించిన ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. వారి వయసు, లింగం, గత ఆరోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, సామాజిక, ఆర్థిక స్థితి వంటి వివరాలను ఏఐ ద్వారా విశ్లేషించారు. ఐదేళ్ల అధ్యయన కాలంలో వీరిలో 38,582 మంది (0.64 శాతం) మెలనోమా బారిన పడినట్లు గుర్తించారు. కేవలం వయసు, లింగం ఆధారంగా మెలనోమాను అంచనా వేసే పద్ధతితో పోలిస్తే, ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలను ఇచ్చింది. సాధారణ పద్ధతిలో 64 శాతం కచ్చితత్వం ఉండగా, అధునాతన ఏఐ మోడల్ సుమారు 73 శాతం కేసుల్లో మెలనోమా వచ్చే వారిని, రాని వారిని వేరు చేయగలిగింది. అంతేకాకుండా, ఐదేళ్లలో మెలనోమా వచ్చే ప్రమాదం 33 శాతం వరకు ఉన్న హై-రిస్క్ గ్రూపులను కూడా ఈ ఏఐ మోడల్ గుర్తించడం విశేషం. గోథెన్‌బర్గ్ యూనివర్సిటీ పరిశోధకుడు మార్టిన్ గిల్‌స్టెడ్ మాట్లాడుతూ, "ఆరోగ్య వ్యవస్థల్లో ఉన్న డేటాతోనే మెలనోమా ముప్పు ఉన్నవారిని గుర్తించవచ్చని మా అధ్యయనం నిరూపించింది" అని తెలిపారు. దీనివల్ల హై-రిస్క్ గ్రూపులకు మాత్రమే సెలెక్టివ్ స్క్రీనింగ్ నిర్వహించి, వైద్య వనరులను మరింత సమర్థంగా వాడుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విధానాన్ని వైద్య రంగంలో ప్రవేశపెట్టే ముందు మరిన్ని పరిశోధనలు, విధానపరమైన నిర్ణయాలు అవసరమని వారు స్పష్టం చేశారు.

## కాల్పుల విరమణ పొడిగింపుపై డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా: కాల్పుల విరమణ పొడిగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని అన్నారు. శాశ్వతమైన ఒప్పందం వైపు తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని అన్నారు. చర్చల ఫలితం ఎలా ఉంటుందనే విషయాన్ని పక్కన పెడితే, ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదని అభిప్రాయపడ్డారు. ఒప్పందం కుదిరితే ఇరాన్ కూడా తమ దేశాన్ని పునర్నిర్మించుకోవచ్చని అన్నారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈ నెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురు చూస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్ అధికారులతో అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నారని ట్రంప్ వెల్లడించారు. రెండో విడత చర్చలపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం

తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరిలో క్రీడా సంబరం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన లోకేశ్... ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు హాకీ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలోని క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు విద్యాభ్యాసం చేసిన చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో రూ.3.17 కోట్ల వ్యయంతో ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకునేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మంజూరు చేయగా, గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, స్కిప్పింగ్, యోగా, జిమ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. అలాగే అవుట్‌డోర్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు ప్రత్యేక హాకీ మైదానాన్ని కూడా సిద్ధం చేశారు. చంద్రగిరి, పరిసర ప్రాంతాల యువ క్రీడాకారుల శిక్షణ, అభివృద్ధికి ఈ కేంద్రం ఒక వేదికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం

శ్రీ సత్యసాయి జిల్లా: శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తాం

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

## పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజి తరువాయి

రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతాం

మొదటి పేజి తరువాయి

దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

## అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయం

హైదరాబాద్: పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

అమరావతి: తెలుగుదేశం పార్టీలో నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు, బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40%), ఎస్సీలకు 25 (25%), ఎస్టీలకు 7 (3.8%), మైనార్టీలకు 13 (7%) చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా... పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లు వంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమిటీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నియామకాల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశించి భంగపడిన వారికి న్యాయం చేశామని, పార్టీ బలోపేతానికి ఈ మార్పులు దోహదపడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం

మొదటి పేజి తరువాయి

మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తలపాగా శపథం నెరవేర్చుకున్న సామ్రాట్

1990లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన సామ్రాట్ చౌదరి, 1999లోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 నుంచి బీజేపీలో కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. నితీశ్ కుమార్ బీజేపీతో తెగదెంపులు చేసుకుని మహాఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సామ్రాట్ చౌదరి ఒక శపథం చేశారు. నితీశ్‌ను సీఎం పదవి నుంచి దించేంత వరకు తన తలపాగా (మురైఠా) తీయనని ప్రతిజ్ఞ చేశారు. ఈ పంతం ఆయన రాజకీయ జీవితంలో ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి తన శపథాన్ని నెరవేర్చుకున్నారు.

అనుభవజ్ఞులైన డిప్యూటీ సీఎంలు

నూతన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇద్దరూ నితీశ్ కుమార్‌కు అత్యంత నమ్మకస్తులు, పరిపాలనలో అనుభవజ్ఞులు. విజయ్ కుమార్ చౌదరి గతంలో పలు కీలక శాఖలు నిర్వహించారు. ఇక, 79 ఏళ్ల విజేంద్ర ప్రసాద్ యాదవ్‌ను 'కోసీ ప్రాంత రాజకీయ చాణక్యుడు'గా పిలుస్తారు. 1990 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న ఆయన, ముఖ్యంగా విద్యుత్ రంగంలో చేసిన అభివృద్ధితో ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. సామ్రాట్ చౌదరి నాయకత్వంలో ఈ అనుభవజ్ఞులైన నేతలతో కూడిన కొత్త ప్రభుత్వం, రాష్ట్ర అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

## దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోం

మొదటి పేజి తరువాయి

దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## తెలంగాణ నుంచి 9 మంది మహిళా ఎంపీలు

హైదరాబాద్: పునర్విభజన బిల్లుతో రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతమున్న వాటిని విభజించి కొత్తగా మరో 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు ఏర్పాటు చేస్తారని అంచనా. దీంతో తెలంగాణ లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరగనుంది. అదనంగా వచ్చే వాటిలో గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కలే 3 లేదా 4 ఏర్పడనుండగా.. లోక్‌సభ ఎన్నికల్లో నగరమే కీలకం కానుంది. పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. అప్పటికి రాష్ట్రంలో పది జిల్లాలున్నాయి. వీటిలో అత్యధికంగా రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో, దేశంలో 17వ ర్యాంకులో ఉంది. ఈ జిల్లా ప్రస్తుతం చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. వీటి పరిధులన్నీ మారిపోయి కొత్త లోక్‌సభ నియోజకవర్గాలు రానున్నాయి. ఏ ప్రాంతం దేని పరిధిలోకి వస్తుందనేది పునర్విభజన తరవాతే తేలనుంది.

ప్రస్తుతమున్న మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో జనాభా అధికంగా ఉండటంతో వీటిని విభజించి కొత్తగా 3 లేదా 4 ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం.. 2024 ఎన్నికల సమయంలో 37.79 లక్షల మంది ఓటర్లతో దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు వేరుపడి కొత్తగా మరో రెండు స్థానాలు రానున్నాయి. ఉమ్మడి మెదక్‌లో ప్రస్తుతం మెదక్, జహీరాబాద్ ఉండగా కొత్తగా మరొకటి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌ను విభజించి అదనంగా మరొకటి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలను విభజించి ఒకట్రెండు ఏర్పాటుచేసే సూచనలున్నాయి.

మహిళలకు తొమ్మిది ఇవ్వాల్సిందే..

ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 9 మంది మహిళలు తెలంగాణ తరపున లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పరిశీలిస్తే ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి 2026-27 జనాభా లెక్కలు అందుబాటులోకి రానున్నాయి. వాటి ఆధారంగానే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మహిళలకు సీట్లను రిజర్వు చేయనున్నారని అంచనా. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మహిళా ఎంపీలు లోక్‌సభకు వెళ్లే సూచనలున్నాయి. రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని మహిళలకు లోక్‌సభ నియోజకవర్గాలను రిజర్వు చేయనున్నారని అధికారవర్గాలు చెబుతున్నాయి. మహిళలకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పెద్దగా టికెట్లు ఇవ్వడం లేదు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురికి, భాజపా, భారాస ఒక్కొక్కరికి మాత్రమే ఇచ్చాయి. 2029 ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి పార్టీ వారికి 9 టికెట్లు ఇవ్వాల్సిందే. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే మహిళా నేతలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని సీనియర్ నేతలు అంటున్నారు. 2024 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాలకు కలిపి 12,459 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వారిలో 8,360 మంది చివరికి బరిలో నిలిచారు. వీరిలో మహిళలు 800(9.6%) మంది మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతానికి వారి వాటా పెరగనుంది. దేశవ్యాప్తంగా 47.63 కోట్ల మంది మహిళా ఓటర్లున్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు.. పవన్ కీలక ఆదేశాలు

అమరావతి: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేశ్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. పుష్కర ఏర్పాట్లపై త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ భేటీలో క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. రాష్ట్ర గౌరవం ఇనుమడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ గోదావరి పుష్కరాలను నిర్వహించబోతోందని మంత్రి దుర్గేశ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## తెలంగాణలో భగ్గుమన్న సూరీడు.. పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు

హైదరాబాద్: తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ తెలుగు దినపత్రిక
BHARAT REPORTER రిపోర్టర్



# గిరిజన బిడ్డకు 'అన్న'ల్లా అండగా నిలిచిన బి.అర్.ఎస్ పార్టీ కాకుల మర్రి లక్ష్మణ్ బాబు

రూ. 1.50 లక్షల ఆర్థిక సాయంతో వైద్య విద్యకు భరోసా!"



వాజేడు ఏప్రిల్ 15 (భారత్ రిపోర్టర్) మండలానికి చెందిన తల్లాడి నవ్యజ్ఞాపిక గిరిజన యువతి, కరీంనగర్‌లోని చెల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తన బిడ్డను డాక్టర్‌గా చూడాలని ఆశపడ్డ తల్లిదండ్రులు శేషయ్య, యశోదలకు ఆర్థిక పరిస్థితి భారంగా మారింది. చేతిలో పైసా లేక, ఫీజు కట్టే దారి తెలియక ఆ గిరిజన బిడ్డ తన వైద్య విద్యను మధ్యలోనే వదిలేయాలని సిద్ధపడింద హృదయ విదారక విషయం వాజేడు మండల పార్టీ అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదబోయిన బుచ్చయ్యల దృష్టికి వెళ్ళింది. ఒక గిరిజన బిడ్డ చదువు ఆగిపోకూడదని వీరు రంగంలోకి దిగి బిఆర్ఎస్ నాయకులు గూడవర్తి నరసింహమూర్తి, ములుగు జిల్లా అధ్యక్షుడు కకులమర్రి లక్ష్మణ్ బాబుల సహకారం కోరి 1,50,000 రూపాయల ఆర్థిక సాయాన్ని, తెలంగాణ రాష్ట్ర మాజీ జల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్ చేతుల మీదుగా ఆ విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, కాకలమర్రి ప్రదీప్ రావు, పాయం జానకి రమణ, ముదుంబ శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొని ఆ విద్యార్థినిని భవిష్యత్తులో మంచి డాక్టర్‌గా ఎదగాలని దీవించారు.

# పొలాల్లో రహదారులు నిర్మించాలి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత



వాజేడు ఏప్రిల్ 15 (భారత్ రిపోర్టర్) వెంకటాపురంలోని వి.ఆర్.కె పురం పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో రోడ్లు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతూ వాడ బలిజ సేవా సంఘం నాయకులు ఎంపీడీవో గారికి వినతిపత్రం సమర్పించారు. చొక్కాల గ్రామం నుండి గోదావరి వరకు ఉన్న పొలాల్లో రోడ్లు లేవు. రైతులు పంటను మెయిన్ రోడ్డుకు తరలించడానికి ఇబ్బంది పడుతున్నారు . కాలినడకన 5 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఉపాధి హామీ పథకం (100 రోజుల పని) ద్వారా ఈ ప్రాంతాల్లో కంకర రోడ్ల నిర్మాణం చేపట్టాలని నాయకులు కోరారు. చొక్కాల వైన్ షాప్ నుండి గోదావరి పాయ వరకు, మరియు మరిగూడెం, నర్సేటిగూడెం మీదుగా పాలెం వాగు వరకు రోడ్లు నిర్మించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జున్ రావు, వి.ఆర్.కె పురం సర్పంచ్ డి. రమ్య మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# పర్మెంటు చేసేవరకు కొనసాగిస్తామని జేపీసీ జిల్లా అధ్యక్షులు సాయిబాబు



వాజేడు ఏప్రిల్ 15 (భారత్ రిపోర్టర్) ములుగు జిల్లా కేంద్రంలో 8వ రోజు సమ్మెలో జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు సాయిబాబు మాట్లాడుతూ... అన్నాడు. ఆర్టిజన్లు సమస్య కోసం అన్నాదులను ఆర్టిజన్ గా గుర్తించాలని 2013 నుండి హనుమాన్ కార్మికులు 1607 మంది ఎన్పీడీసీఎల్ లో పనిచేస్తున్నాం.




2017 లో ఎన్పీడీసీఎల్ లో కట్టరుగా పనిచేసే వాళ్ళను ఆర్టిజన్ గా గుర్తించారు. ఎన్పీడీసీఎల్ లో పనిచేసే హన్మాండ్ కార్మికులను ఈపీఎఫ్ లేని వలన ఆర్టిజన్ గా గుర్తించలేదు అన్నాడు. కార్మికుల లాగాన నిలిచిపోయారు. ఈపీఎఫ్ కట్టేది యాజమాన్యం. యజమానిమే ఈపీఎఫ్ కట్టకపోవడం వల్ల అన్నమాండ్ కార్మికులు 1607 మంది జీవితాలు రోడ్డున పడ్డాయి. 150 మంది చనిపోయారు, 50 మంది అంగవైకల్యం అయ్యారు. ఇప్పటికైనా అన్నమాండ్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని అన్నారు. ఆర్టిజన్ వాళ్లకు ఏపీ ఎస్ ఈ బి రూల్స్ వర్తించాలని కోరుతున్నాము. జేపీసీ ఆర్టిజన్ అధ్యక్షుడు జజ్జరి సాయిబాబు, యాస సురేష్ రెడ్డి, ములుగు జిల్లా అన్నమాండ్ ల అధ్యక్షులు మాదాటి సురేందర్ రెడ్డి, ఏసుబాబు, డి రాజు, సురేష్, అశోక్, సంజీవరెడ్డి, సతీషు, సాయి, రమేషు, రాజు, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టాంప్ పేపర్లు లేక ఇబ్బంది పడుతున్న క్రయవిక్రయదారులు




కత్బుల్లాపూర్,15 ఏప్రిల్ ( భారత్ న్యూస్ రిపోర్టర్)కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో స్టాంప్ పేపర్లు లేకపోవడంతో ఎంతోమంది క్రయ విక్రయదారులు, విద్యార్థులు ఎంతో ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు, స్టాకు ఉన్నవారు ఇద్దరు,ముగ్గురు,స్టాంప్ వెండర్లున్ 100 రూపాయల స్టాంప్ పేపర్ 180, 200 రూపాయలకు విక్రయించుస్తునారు,

# అంబేద్కర్ ఆశయాలు శివాజీ మహారాజ్ స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి కృషి చేయాలి చేయాలి మాద్రి పృథ్వీరాజ్......



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ( భారత్ న్యూస్ రిపోర్టర్)నియోజకవర్గంలోని వడక్పల్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన. డా. బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం అదేవిధంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ వారి విగ్రహాల ఆవిష్కరణ



కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీర్ ఫౌండేషన్ కో ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ వారు మాట్లాడుత డా. బి.ఆర్. అంబేద్కర్ వారి ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం కాబట్టి. సామాజిక న్యాయం సాధించేందుకు అందరం కృషి చేయాలని అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ వారి స్ఫూర్తితో ధైర్యం దేశభక్తి అదేవిధంగా నాయకత్వ లక్షణాలను యువత అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ వారి ఆశయాలు అదేవిధంగా శివాజీ మహారాజ్ వారి వీరత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి దారి చూపుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ దేవనంద్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, విజయ్, గ్రామ పెద్దలు నాయకులు అదేవిధంగా ఎంపీర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వార్షికోత్సవాలు



మక్తల్ ఏప్రిల్15 భారత్ రిపోర్టర్ నియోజకవర్గ ప్రతినిధి : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో అగ్నిమాపక సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్ లోప్రజలనుఅవగాహన పరుచుటకై కరపత్రాలు పంపిణీ చేసి అగ్నిమాపకపై ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. 1944 ఏప్రిల్



14న బొంబాయి విక్టోరియా డాక్ యార్డులో ఒక నౌకాలో అగ్ని ప్రమాదం సంభవించి విధి నిర్వహణలో ఉన్న 66 మంది సిబ్బంది అగ్నికి హవుతాయ్యారు. అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20వరకు దేశవ్యా ప్తంగావార్షికోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని తెలియజేశారు అందుకే వం ట గదుల్లో గ్యాస్ సిలిండర్లు జాగ్రత్త వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ గౌడ్, అనంతయ్య, అశోక్, నరసింహులు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు

# జంపపాలెం గ్రామంలో ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



యలమంచిలి ఏప్రిల్ 15 (భారత్ రిపోర్టర్ ) భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఎలమంచిలి మండలం జంపపాలెం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి గ్రామ పెద్దలు యువకులు పూలమాలలు



వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక కళాకారులు లయబద్ధంగా కోలాటం ఆడుతూ వేడుకల్లో ఉత్సాహాన్ని నింపారు. జై భీమ్ నినాదాలతో గ్రామ వీధులన్నీ మారుమోగాయి. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువత అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# జిల్లాలో అబార్షన్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలి,

ప్రతి కేసు వెనుక ఉన్న కారణాలు, చోటుచేసుకునే ప్రాంతాలపై సమగ్ర పరిశీలన చేసి నివేదిక సమర్పించాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.



వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ 15 ఏప్రిల్2026 బుధవారంబుధవారం జిల్లా కలెక్టర్ గోపాలపేట మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈడీడీ (జుఃణ) డెలివరీ రిజిస్టర్లను పరిశీలించి,



ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు మరియు అబార్షన్ ల వివరాలపై విచారణ చేశారు. అబార్షన్ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. అబార్షన్ ల కారణాలు, అవి ఎక్కడ జరుగుతున్నాయి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో మెరుగైన సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రతిపాదనలు ఫైల్ రూపంలో సమర్పించాలని అధికారులకు సూచించారు. మహిళలకు ూఎ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరంగోపాలపేట మండలం పొలికేపాడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల విడుదలకు సంబంధించిన విషయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరైన 35 ఇళ్లలో 34 ఇళ్లు గ్రౌండింగ్ పూర్తి కాగా, 3 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు తదుపరి దశలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ శైలి మరియు ఇతర వివరాలను తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ మాట్లాడుతూ, ఈ భవనం త్వరలో అసిస్టెంట్ ఇంజనీర్ (హౌసింగ్) కార్యాలయంగా ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం లో సెన్సస్ (జన గణన ) ప్రక్రియపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ వేగంగా హెచ్ ఎల్ బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ ) గుర్తించి, డిమార్కెషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ విటోభా, సీపీ ఓ హరికృష్ణ, తహసీల్దార్ తిలక్, వైద్య అధికారులు ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# గూగుడు పంచాయతీ టోల్ గేట్ వేలం ఖరారు లక్షా 18 వేలకు దక్కించుకున్న సేవనంద కుమార్



నార్పల:15 ఏప్రిల్ 2026 ( భారత్ న్యూస్): నార్పల మండలం గూగుడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక అధికారి మరియు ఎంపీడీవో మమతాదేవి ఆధ్వర్యంలో గ్రామ టోల్ గేట్ నిర్వహణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో కణం సేవనంద కుమార్ అత్యధికంగా రూ. 1,18,000 (అక్షరాలా లక్షా పద్దెనిమిది వేల రూపాయలు) పాడి టోల్ గేట్ నిర్వహణ హక్కును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఈ టోల్ గేట్ వసూళ్లు కేవలం విడి దినాల్లో మాత్రమే అమలవుతాయని, కుల్లాయ స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో ఈ టోల్ గేట్ వసూళ్లకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ఏడాది కాలం పాటు అమలులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో గౌరవ డీఎల్పీవో విజయ్ కుమార్, ఎంపీడీవో మమతాదేవి, పంచాయతీ సిబ్బంది మరియు వేలం పాటదారులు పాల్గొన్నారు. అనంతరం గూగుడు గ్రామానికి సంబంధించిన నూతన ఓటర్ల జాబితాను ఎంపీడీవో మమతాదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. చివరగా గ్రామంలోని ఎస్.డబ్ల్యూ.పి.సి షెడ్డును అధికారులు సందర్శించారు. షెడ్ నిర్వహణ, చెత్త సేకరణ మరియు తడి-పొడి చెత్త వేరుచేసే ప్రక్రియను పరిశీలించి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీఓ భారతి



నార్పల:15 ఏప్రిల్ 2026 ( భారత్ న్యూస్ ):మండలంలోని నాయనపల్లి సెక్టార్ దుగుమర్రి-1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 8వ 'పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ భారతి మాట్లాడుతూ,గర్భిణీలు,బాలింతలు మరియు పిల్లల ఆరోగ్య విషయంలో పోషకాహారం



కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. లబ్ధిదారులకు పోషణ ప్రాముఖ్యతను వివరించడానికి కథల ద్వారా అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ మరియు ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించి,వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం స్థానికంగా దొరికే పోషక విలువల ఆహార పదార్థాలతో చేసిన వంటల ప్రదర్శన మరియు వంటల పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. అనంతరం అధికారులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పిల్లల ఎదుగుదల, అభివృద్ధి దశలను పరిశీలించారు. పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించారు. ఇదే క్రమంలో గర్భవతులకు 'గర్భవతి ఆహ్వానం',తల్లుల సమక్షంలో 'ముస్తాబు' వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు సునాలిని,లావణ్య,అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రేమలత,లక్ష్మీదేవి,రామాంజనమ్మ, నాగేశ్వరి, కళావతి, హెల్పర్లు, కిశోర బాలికలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జడ్పిహెచ్ఎస్ పఠాన్ చెరువు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమం లో పాల్గొన్న ఆర్డీవో మెమోరాండం అందజేసిన బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి.......



సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి (భారత్ రిపోర్టర్) 2026 ఏప్రిల్ 15 సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పట్టణ కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో. జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో వారికి మెమొరడం అందజేసిన బిజెపి సంగారెడ్డి జిల్లా




అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్యాక్రాంతం అయిన పాఠశాల స్థలాన్ని ప్రభుత్వం తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. పాఠశాలకు అక్కడే శాశ్వత భవనాన్ని నిర్మాణం చేయాలి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రభుత్వం పాఠశాల భవనాన్ని కూల్చివేయడం సరిఅయింది కాదు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసికొని ఈ సమస్యని పరిష్కారం చేయని యెడల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేస్తాం అని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి వారు మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ వారు పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అశోక్ వారు బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి రెడ్డి. బిజెపి సీనియర్ నాయకులు కుమార్ శ్రీనివాస్ గుప్తా పాఠశాల పూర్వ విద్యార్థులు ఇతర నాయకులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ కళాశాలల్లో చదివించండి.. లేదా వనపర్తిలో ఉన్న కాలేజీల్లో చదివించండి. ఆఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు

హైద్రాబాద్ కార్పొరేట్ కాలేజీల్లో మాత్రం వద్దు, అలా చదివిస్తే ఒత్తిడితో విద్యార్థుల స్వంత విజ్ఞానానికి దూరమవుతున్నారు.









వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ 15 ఏప్రిల్ 2026 హైదరాబాద్ కార్పొరేట్ కాలేజీల్లో పిల్లలను చదివింపులు అధిక ఒత్తిడులకు గురై స్వంత విజ్ఞానాని కోల్పోయి చదవలేకపోతున్నారు దానికిబదులుగ మార్కులు తక్కువరావడంతో ఆత్మహత్యలకు, పాల్పడుతున్నారు. డబ్బులు వృధా అవుతున్నాయని,విద్యార్థినీ ,విద్యార్థుల తల్లిదండ్రులకు అఖిలపక్ష ఐక్యవేదిక విజ్ఞప్తి చేశారుబుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ ప్రభుత్వ కళాశాలలో చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని విద్యార్థులకుసన్మానంచేసిస్వీటు తినిపించారు ముందుగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బాలుర దగ్గరికి వెళితే అక్కడ ఉన్న ప్రిన్సిపల్ రెండు రోజులుగా విద్యార్థులను పిలిపిస్తానని చెప్పి పిలిపించలేకపోయారు. ఇక్కడి నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం దగ్గరకు వెళ్లి అక్కడ విద్యార్థినిలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న విద్యార్థినిలు ఎంపీపీ సెకండియర్ 930/1000, ఎంపీసీ ఫస్టియర్ 459/470 సీ ఈ సీ సెకండ్ ఇయర్ 849/1000 మార్కులు దాదాపు 85% నుండి 95% పైగా తెచ్చుకున్న విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కళాశాలలో చదివి ఆదర్శవంతంగా నిలవాలని విద్యార్థినీ విద్యార్థులకు సతీష్ యాదవ్ సూచించారుఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో " అక్షర " జూనియర్ కళాశాల అక్షర ప్రభంజణాన్ని సృష్టించింది.



ఘన ఫలితాలతో ఆనందాన్ని వ్యక్తం చేసిన కళాశాల యాజమాన్యం ఖాజావలి.

అనంతపురం ప్రతినిధి ఏప్రిల్ 15 ( భారత్ రిపోర్టర్ న్యూస్ )నగరానికి కూత వేటు దూరంలో గల అక్షర జూనియర్ కళాశాలలో కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరానికి అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి లో నిలిచేలా ఘన విజయాలను సాదించడం గర్వకారణమని కళాశాల యాజమాన్యం ఖాజావలి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన ఇంటర్ ఫలితాలలో మా విద్యార్థులు స్వేచ్ఛ క్రమశిక్షణ అనువైన ఫీజులతో ఆలాగ వాతావరణంలో విద్యార్థులను తీర్చిదిద్దడంతో ఇలాంటి విజయాలను సాధించాలని ఆయన పేర్కొన్నారు. అక్షర విద్యా సంస్థ ఇంతటితో ఆగకుండా ప్రత్యేక విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమదైన కృషితో సమాజానికి రేపటి మిసైల్స్ ను తయారు చేస్తుందని గర్వంగా చెబుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఘన విజయాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అక్షర జూనియర్ కళాశాల పేరులోనే అక్షరం ఉందని, కావున ఇక్కడికి చదువుకు పంపే విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వారు కలలు కన్న కలలను నెరవేర్చే దిశగా అక్షర జూనియర్ కళాశాల కట్టుబడి ఉంటుందని చెప్పారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్
తెలుగు దినపత్రిక
BHARAT REPORTER రిపోర్టర్



## పిల్లల ప్రాణ రక్షణలో ఒక్క క్షణం నిర్లక్ష్యం కూడా ప్రమాదమే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత ప్రతి ప్రాణం అమూల్యమైనది డి సి ఆర్బి డిస్పి ఏ, బాలజి నాయక్

హ్యూమన్ చైన్‌తో సమాజానికి గట్టి హెచ్చరిక రాజపేటలో విద్యార్థులతో భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమం

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్'

రోడ్డు భద్రత వారోత్సవాలు మూడవ రోజు సందర్భంగా పిల్లల రోడ్డు భద్రత దినోత్సవం ఘనంగా నిర్వహించారు.




వనపర్తి రూరల్ (భారత్ రిపోర్టర్) పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజపేట పోలీస్ పెట్రోల్ బంక్ సమీపంలో, డిసిఆర్బి డిఎస్పీ ఏ. బాలాజీ నాయక్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి, భద్రత ప్రతిజ్ఞ చేయించారు.విద్యార్థులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలియజేశారు.హ్యూమన్ చైన్ ప్రజల్లో గట్టి సందేశం చేయి చేయి కలిస్తే మార్పు ఖాయం విద్యార్థులు, పోలీసులు, వాలంటీర్లు కలిసి హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసి, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిఎస్పీమాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం ట్రాఫిక్ నియమాలు పాటించడం మాత్రమే కాదు అది మన కుటుంబాల ఆనందాన్ని కాపాడే జీవన విధానం. ఒక్క క్షణం నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాలు జీవితాంతం బాధను అనుభవిస్తున్నారని, హెల్మెట్, సీటుబెల్ట్ వంటి చిన్న జాగ్రత్తలు మన ప్రాణాలను రక్షించే పెద్ద ఆయుధాలు. ప్రతి తల్లిదండ్రి, ప్రతి డ్రైవర్, ప్రతి పౌరుడు తమ బాధ్యతను గుర్తించి ట్రాఫిక్ నియమాలను పాటించాలి.పిల్లలు మన భవిష్యత్ వారి భద్రత మన చేతుల్లోనే ఉంది.వారి కోసం అయినా మనం నియమాలను కచ్చితంగా పాటించాలని 'అరైవ్ అలైవ్' అంటే కేవలం గమ్యస్థానానికి చేరుకోవడం కాదు మన కుటుంబాల వద్దకు సురక్షితంగా తిరిగి చేరుకోవడం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా డ్రైవ్ చేస్తేనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించగలం అని ఆయన స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని డిఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ ఎస్సై రిషికేష్ గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల రాజపేట్ అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ డిఈఈ కి ఆర్టిఐ దరఖాస్తుదారు నోటీసు.



సూళ్ళూరుపేట, ఏప్రిల్ 15, భారత్ రిపోర్టర్:తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంపై సమాచార హక్కు చట్టం, 2005 కింద ఘాటైన వివాదం చెలరేగింది. ఆర్టీఐ దరఖాస్తుదారుడు బల్లి ఆశిష్ బుధవారం సంబంధిత పౌర సమాచార అధికారికి కఠినమైన లీగల్ నోటీసు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో సమాచారం కోసం దాఖలు చేసిన దరఖాస్తులకు స్పందిస్తూ సుమారు 75 పేజీల సమాచారాన్ని కార్యాలయం 30 రోజుల్లో ఉచితంగా అందజేయడం జరిగిందని, అది కూడా ధరఖాస్తులో పేర్కొన్న విధంగా పూర్తిస్థాయి సమాచారం కాదని, అయితే ప్రతి పేజీకి రూ.2 చొప్పున వసూలు చేయాల్సిన చట్టబద్ధ ఫీజును ముందుగా తెలియజేయకుండా మరియు వసూలు చేయకుండానే సమాచారం అందించడం సమాచార హక్కు చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని దరఖాస్తుదారుడు ఆరోపించారు. ముఖ్యంగా చట్టంలోని సెక్షన్ 7 ప్రక్రియలను విస్మరించడం అధికారుల నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజుల్లోగా పూర్తి స్థాయి చట్టపరమైన వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు దాఖలు చేయడంతో పాటు శిక్షార్హ చర్యలు కోరనున్నట్లు హెచ్చరించారు. దీంతో హౌసింగ్ శాఖలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

## ఇంటర్ ఫలితాల్లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



యలమంచిలి ఏప్రిల్ 15 (భారత్ రిపోర్టర్ ) నేడు విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న యల్లపు ప్రశాంతి 978 /1000 (ఎంపీసీ ) మార్కులు , పిల్లా కావ్య 966 /1000( ఎంపీసీ ) మార్కులు, షేక్ గౌషియా బేగం 940/1000 (ఎంపీసీ ) మార్కులు సాధించారు. వీరిలో ప్రశాంతి సోమలింగపాలెం గ్రామానికి చెందిన యల్లపు శ్రీనివాసరావు కుమార్తె. వీరిది సాధారణ రైతు కుటుంబం. పిల్లా కావ్య రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన విద్యార్థిని. ఈమె తండ్రి రైతు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులైన పట్టుదలతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు కళాశాల అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు . ఇదే కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్ కుసుమ 441 /470 (ఎంపీసీ ) మార్కులతో కళాశాల టాపర్ గా నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి సురేష్ బాల్ , డైరెక్టర్లు వేదుల తేజశ్రీ , వేదుల రవి అభినందించారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజల ప్రాణ రక్షణకు రోడ్డు భద్రతా నియమాల అమలు అత్యంత ముఖ్యం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ 15 ఏప్రిల్ 2026బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నాగవరం రవాణా శాఖ




కార్యాలయం (ఆర్ టి ఓ)లో ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన కంటి పరీక్ష శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమాలను నిర్దేశించిన ప్రణాళికా ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు రోడ్డు నియమాల అమలు అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి టీ ఓ మానస, సంబంధిత అధికారులు, రవాణా శాఖ సిబ్బంది మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతు పనులు 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని



మక్తల్ ఏప్రిల్ 15 భారత్ రిపోర్టర్ నియోజకవర్గ ప్రతినిధి మక్తల్ మున్సిపాలిటీలోని 16వ వార్డు లో బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి ఇతర వార్డులకు నీటిని పంపింగ్ చేసే పైప్ లైన్లకు లీకేజీలు ఏర్పడగా... వాటికి సంబంధించిన మరమత్తు పనులను 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని బుధవారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా అల్కూరి పావని మాట్లాడుతూ.16 వార్డుకు సంబంధించినవే కాకుండా.. ఇతర వార్డులకు సైతం మంచినీటి సరఫరా జరిగే పైప్ లైన్లకు లీకేజీలు ఏర్పడితే..బాధ్యతగా తీసుకొని మున్సిపాలిటీ సిబ్బందితో సమన్వయం చేసుకొని లీకేజీల మరమ్మతులు చేపట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా



చేపట్టామని అన్నారు.వాస్తవాలుతెలుసుకోకుండా తమ మీద బురద జల్లడం పద్ధతి కాదని, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ... సమస్యలను పరిష్కరిస్తూ చేదోడు వాదోడుగా ఉంటున్నామని.. 16 వార్డుప్రజలకుఅందరికీఈవిషయంతెలుసనిచురకలంటించారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవతో 16 వార్డుకు అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్,మార్కెట్ డైరెక్టర్ శాలం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి సొమ్ము రికవరీ చేయాలి

కలెక్టర్‌కు వినతి పత్రం



చింతూరు భారత్ ఏప్రిల్ 15: చింతూరు మండలంలోని వెలుగు కార్యక్రమంలో జరిగిన భారీ అవినీతి సొమ్మును తిరిగి వసూలు చేసి బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ, మహిళా సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఏ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.




అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ, చింతూరు మండలంలో వెలుగు కార్యక్రమంలో 2017, 2018 నుండి 2020 వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇవ్వాల్సిన రుణాలు సుమారు ఒక కోటి ముప్పై లక్షల రూపాయలు అప్పటి అధికారుల చేత పక్కదారి పట్టించబడ్డాయని ఆరోపించారు. దీంతో అసలు రుణాలు తీసుకోని 458 మంది సభ్యుల పేర్లపై రుణాలు నమోదై ఉన్నాయని తెలిపారు. ఈ కారణంగా గత పది సంవత్సరాలుగా ఆ సభ్యులకు కొత్త రుణాలు అందడం లేదని, వారి పేర్లపై ఉన్న రుణాలకు వడ్డీలు పెరుగుతూ చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల బాధితులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కావున అవినీతికి పాల్పడిన అధికారులపై తగిన చర్యలు తీసుకొని, దారి మళ్లించిన సొమ్మును తిరిగి వసూలు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యను పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోడియం లక్ష్మణ్, నాయకులు చింత రాంబాబు, పొడియం జానీ, బాధితులు శ్రీదేవి, నాగమ్మ, శారద, దుర్గ, సుబ్బమ్మ, ముత్తమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశం



మక్తల్ ఏప్రిల్ 15 భారత్ రిపోర్టర్ నియోజకవర్గ ప్రతినిధి : నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం తాళం కేరి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు తాళంకేరి యఱ్ర. తాయమ్మ యఱ్ర. భీమేశప్ప నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిలు గా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం ప్రారంభించారు ఇట్టి కార్యక్రమంలో మాగనూరు మండల నాయకులు నరసింహారెడ్డి, శివరాం రెడ్డి, వడ్వావాట్ సర్పంచ్ రవీందర్ ,వర్కూరు. సర్పంచ్ లక్ష్మణ్, గుఱ్రావ్ లింగంపల్లి ఉప సర్పంచ్ ఆంజనేయులు(సిద్దు) తాళంకేరి ఉప సర్పంచ్ శ్యామ్, తాళంకేరి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ, సురేష్, లక్ష్మణ్, రాజు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఏజెన్సీ మారుమూల గ్రామం నుంచి మెరిసిన ఆణిముత్యం

ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన కోనం లోకేష్



చింతూరు భారత్ ఏప్రిల్ 15:సరివేల మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి కోనం లోకేష్ కుమార్ ఇంటర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విశిష్ట ఫలితాన్ని సాధించి తన కుటుంబానికి ఆనందభాష్పాలు తెప్పించాడు. మొత్తం 1000 మార్కుల్లో 944 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జంగారెడ్డిగూడెం విద్య వికాస్ కాలేజీ లో



AP ఇంటర్ పరీక్షా ఫలితాలు 2026

Hall Ticket : 2611220927
Name : KONAM LOKESH KUMAR
Total : 944 ( PASS / A )

| | Subject | 1st Year | | 2nd Year | |
|---|---|---|---|---|---|
| 1 | ENGLISH | 85 | P | 94 | P |
| 2 | SANSKRIT | 97 | P | 98 | P |
| 3 | MATHEMATICS (A) | 72 | P | 74 | P |
| 4 | MATHEMATICS (B) | 65 | P | 75 | P |
| 5 | PHYSICS | 56 | P | 55 | P |
| 6 | CHEMISTRY | 56 | P | 57 | P |
| 7 | PHYSICS PRACTICAL | -- | -- | 30 | P |
| 8 | CHEMISTRY PRACTICAL | -- | -- | 30 | P |

| | |
|---|---|
| Total Marks In Figures | 944 |
| In Words | *Nine**Hundred**and**Forty**Four* |
| Date | 15-04-2026 |

PASSED

Disclaimer : Way2news does not vouch for the authencity and not responsible for any inadvertant error.

చదువుకుని సాధారణ కుటుంబ పరిస్థితుల్లోనూ కష్టపడి చదివి ఈ స్థాయి ఫలితాన్ని సాధించడం గ్రామస్థులను, ఉపాధ్యాయులను గర్వపడేలా చేసింది. చిన్న గ్రామం నుంచి పెద్ద లక్ష్యాన్ని సాధించిన లోకేష్ పట్టుదల అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా లోకేష్‌కు తల్లి సూర్యకుమారి, తండ్రి శ్రీనివాసరావు, మేనమామ బేడే సతీష్, లావణ్య, బాబాయి దుర్గాప్రసాద్, కావ్య తదితర కుటుంబ సభ్యులు ఘనంగా అభినందనలు తెలిపారు. అతని విజయంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, స్నేహితులు కూడా లోకేష్‌ను అభినందనలు తెలిపారు. ఈ విజయం సరివేల గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.

## పోలవరం జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి ఏపీయూడబ్ల్యూజే కలెక్టర్ కు వినతి



చింతూరు భారత్ ఏప్రిల్ 15:పోలవరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మాసినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలిసి, చింతూరు ఐటిడిఎలో నిర్వహించిన గ్రీవెన్స్‌లోజిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ ఆలస్యంగా జరుగుతుండటంతో తమ విధుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు.అదేవిధంగా, వెటరన్ జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాజధాని హెడ్‌క్వార్టర్‌కు మాత్రమే పరిమితమైన ఈ సౌకర్యం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారిని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ాూాఖఔజీ సహాయ కార్యదర్శి ఎం.డి సౌకత్ అలీ , కమిటీ సభ్యులు ఈశ్వరాచారీ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా సహాయ కార్యదర్శి కె .జీవన్ , సభ్యులు భాస్కరా చారి, చింతూరు వార్త రిపోర్టర్ జానీ,బెజవాడ నరేష్,రియాజ్,సుధాకర్, పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై ఎంపీడీఓకు సర్పంచుల ఫిర్యాదు



వాజేడు, ఏప్రిల్ 15(భారత్ రిపోర్టర్ ) మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని, నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ వాజేడు మండల సర్పంచులు బుధవారం ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు.గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్పంచులకు తెలియకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.నిధుల మళ్లింపు: సర్పంచుల ప్రమేయం లేకుండా, వారి సంతకాలు లేకుండానే నిధులు విత్ డ్రా చేస్తున్నారని, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.పంచాయతీ పరిపాలనలో ప్రోటోకాల్ ప్రకారం సర్పంచులకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గతంలో తీసుకున్న బిల్లులకు సంబంధించి గ్రామసభ ద్వారా పూర్తి వివరాలను వెల్లడించాలని వారు కోరారు.తమకు తెలియకుండా నిధులు డ్రా కాకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచులు ఎంపీడీఓను వేడుకున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్



చింతూరు భారత్ ఏప్రిల్ 15:పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించి, మిగిలిన వాటికి తగిన పరిష్కార మార్గాలు అన్వేషించి సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం చింతూరు ఐటిడిఏ సమావేశపు మందిరంలో వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 223 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతల మేరకు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టు పరిశ్రమ రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి రావలసిన బకాయిలను చెల్లించాలని కొక్కెరపాటి రవీంద్ర కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా చింతూరు మండలంలోని నర్సింగ్‌పేట గ్రామానికి సంబంధించిన భూభాగాన్ని కాంటూరులో చేర్చి సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని రవ్వ రాజయ్య, తుఱ్రం శేఖర్ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రుక్మాంగ దయ్య, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు షరీఫ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. సరిత, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, ఏజెన్సీ గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సంచాలకులు దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారి టి. శ్రీనివాస్ విశ్వనాథ్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, తహసీల్దార్ హుస్సేన్, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళి, సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు సంచాలకులు కె. ఉమా, సత్యనారాయణ, విభాగీయ పౌర సరఫరా అధికారి విజయభాస్కర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నరసింగ పేట గ్రామాన్ని 41 కాంటూరు కలపాలని ఐటీడీఏ ఎదుట ధర్నా



చింతూరు భారత్ ఏప్రిల్ 15: 41 కాంటూరు లో తమ గ్రామాన్ని కలపాలని ముకునూరు పంచాయతీ లోగల నరసింగ పేట గ్రామస్తులు ఐటీడీఏ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఆ వినతి పత్రంలో 2018 మార్చ్ నెలలో వ్యవసాయ భూములను సర్వే చేయడానికి ఒక గ్రామ సభ అధికారులు నిర్వహించారని, 2018 సెప్టెంబర్ నెలలో



నోటిఫికేషన్ జారీ చేశారని ఆ నోటిఫికేషన్ పై అభ్యంతరాలు వచ్చిన కారణంగా సవరణలు చేసి అక్టోబర్ నెలలో మరో నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటివరకు భూముల నష్టపరిహారం కానీ, పునరావాసం అందలేదని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా సంభవిస్తున్న వరదలు, బ్యాక్ వాటర్ కారణంగా భూములన్ని మునిగిపోయి తమకు జీవనోపాధి లేకుండా పోతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తన కుటుంబాలకు 8 సంవత్సరాలుగా జీవనోపాధి కి దూరమయ్యామని, వరదల మధ్య చిక్కుకున్న తమ దీనమైన జీవితాలను కాపాడవలసిందిగా, దయగల జిల్లా ఉన్నతాధికారులు తమను పేదరికపు కోరలు నుండి, గౌరవ ప్రథమైన జీవితం గడపడానికి అర్హత ఉన్న పునరావాసం, భూములకు నష్టపరిహారం అందించడం ద్వారా న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నరసింగ పేట గ్రామస్తులు, మహిళలు, పురుషులు, పిల్లలతో సహా పాల్గొన్నారు.

## కోసిగి టౌన్ లో అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవం



కౌతాళం మండలం భారత్ రిపోర్టర్ ఏప్రిల్ 15కోసిగి న్యూస్.5కే భోజనం అందించే అన్న క్యాంటీన్ మంత్రాలయం నియోజకవర్గం కోసిగి లో టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి. రుబ్బన్ కట్టింగ్ చేశారు.మంత్రాలయం నియోజకవర్గం కోసిగి టౌన్‌లో నిర్వహించిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులుగా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మరియు మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి , జనసేన ఇన్చార్జి లక్ష్మన్న బిజెపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం పేద ప్రజలకురూ 5కే భోజనం అందజేశారుఈ సందర్భంగా ఇన్చార్జిరాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూఏపీలో గ్రామాలకు చేరుతున్న అన్న క్యాంటీన్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 62 కొత్త అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయని అని తెలిపారు.మొత్తం క్యాంటీన్లు: 269కేవలం 5కే భోజనం కు



ఇప్పటికే 8.80 కోట్ల మందికి లాభంఇప్పటివరకు పట్టణాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ సేవలు ఇప్పుడు గ్రామాలకు కూడా విస్తరిస్తున్నాయని తెలిపారు.పేదల ఆకలి తీర్చే అద్భుత పథకంరోజుకు లక్షల మందికి భోజనం అందించే మహత్తర కార్యక్రమం ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ పై సవరణను వ్యతిరేకిస్తూ నల్లజెండాలు ఎగరవేయాలి



చెన్నై : నియోజకవర్గాల పునర్విభజనపై ప్రతిపాదిత సవరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు నల్ల జెండాలను ఎగరవేయాలని కోరారు. ఈ సవరణను -నల్ల చట్టం', -కుట్ర'గా ఆయన అభివర్ణించారు. "పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలను ఎగరవేస్తాము. భారతదేశాన్ని తిరోగమన దిశగా నడిపిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా నల్లజెండాలు ఎగరవేయండి" అని అన్నారు. పార్టీ ఎంపిలు, జిల్లా కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు, ఢిల్లీల మధ్య పోరేనన్న తన వాదనను బిజెపి రుజువుచేస్తోందని మండిపడ్డారు. తమ ప్రకటనలోని వాస్తవాన్ని బిజెపి గ్రహించిందని, తమిళనాడు అభివృద్ధి చెందడాన్ని గాని, పార్లమెంటులో తమిళనాడు ప్రతినిధుల గొంతుకను వినిపించడాన్ని గానీ బిజెపి కోరుకోవడం లేదని అన్నారు. ఈ కుట్రకు రూపమిచ్చేందుకే సవరణను ప్రవేశపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రను చట్టంగా తామెలా అంగీకరించగలమని కేంద్రాన్ని ప్రశ్నించారు. డీలిమిటేషన్ కేవలం జనాభా ఆధారంగా జరగకూడదని, ఈ నల్ల చట్టాన్ని అమలు చేయకూడదని పునరుద్ఘాటించారు. ఇది ఎనిమిది కోట్ల తమిళుల ఏకైక డిమాండ్ అని అన్నారు. రాజకీయ అడ్డంకులను అధిగమించి, రాష్ట్ర హక్కుల కోసం గళం విప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. -తమిళనాడు పోరాడి గెలుస్తుంది. మనం ఐక్యంగా గెలుద్దాం ' అని అన్నారు. ప్రధాని మోడీ దక్షిణాది రాష్ట్రాలను , అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులస్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. జనాభాను నియంత్రించినందుకు ఇది శిక్షా అని ప్రశ్నించారు. తాము దేశ సంక్షేమం, ఐక్యత కోసం నిలబడ్డామని, తమ రాజకీయ హక్కులను లాక్కుంటున్నారని, ఇంతకంటే క్రూరమైనది మరొకటి లేదని అన్నారు. మోడీ ప్రభుత్వ సవరణ ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే ఎంపిల సంఖ్యలో అసమానతను సృష్టిస్తుందని అన్నారు. డీలిమిటేషన్ పేరుతో మోడీ ప్రభుత్వం హద్దులు దాటి, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల అధికారాలను తగ్గించి, ఉత్తరాది రాష్ట్రాలకు మరింతగా అధికారాన్ని కట్టబెడితే తమిళనాడు రాష్ట్రం చూస్తూ ఊరుకోదని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతుందని అన్నారు.

## ఇరాన్‌పై బలప్రయోగం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది : ఇరాన్ అధ్యక్షుడు



టెహ్రాన్ : ఇరాన్‌ను బలవంతంగా లొంగదీసుకోవాలని చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది అని బుధవారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరించారు. తాజాగా పాకిస్తాన్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమవ్వడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహావేశంతో హార్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ప్రకటించాడు. అనుకున్నట్టుగానే ఇరాన్ పోర్టులకి వెళ్లే నౌకల్ని అమెరికా సైన్యం అడ్డుకుంది. ఈ తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందించారు. ఇరాన్‌పై బలప్రయోగం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని ఆయన హెచ్చరించారు. 'మేము నిర్మాణాత్మక చర్చలకే ప్రాధాన్యత ఇస్తాము. ఇరాన్‌ను లొంగిపోయేలా బలవంతం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది. ప్రజలు అటువంటి విధానాన్ని ఎన్నటికీ అంగీకరించరు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు అని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఎస్ఎన్ఎకి ఆయన వెల్లడించారు. కాగా, ఏ అధికారంతో, ఏ నేరానికి పాల్పడి మా దేశంపై దాడి జరిగింది. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించి పౌరులను, ఉన్నత వర్గాలను, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం, పాఠశాలలు, ఆసుపత్రులతో సహా కీలక కేంద్రాలను ధ్వంసం చేయడాన్ని అమెరికా ఎలా సమర్థించుకుంటుంది అని ఆయన మీడియా ద్వారా ప్రశ్నించారు. తమ దేశం శాంతిని, దౌత్య సంబంధాలను కోరుకుంటుంది. అయితే దాని సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఎలాంటి బాహ్య దురాక్రమణనైనా లేదా ఒత్తిడినైనా గట్టిగా ప్రతిఘటిస్తుందని ఇరాన్ అధ్యక్షుడు పునరుద్ఘాటించారు.

## మార్చి నెలలో రికార్డు స్థాయిలో ఎగుమతులు



న్యూఢిల్లీ : 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎగుమతులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. వస్తువులు, సేవల సంయుక్త ఎగుమతులు తొలిసారిగా 860 బిలియన్ డాలర్ల మార్కును దాటాయి. ఈ ఎగుమతులతో భారత్ ప్రపంచ వాణిజ్యంలో నిరంతర పురోగతిని, బలమైన పట్టుని సాధిస్తున్నట్లు సూచిస్తుంది. కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. గతేడాది 2025లో 825.26 బిలియన్ల మేర ఎగుమతులు జరిగితే.. ఈ ఏడాది 2026 ఏప్రిల్- మార్చి నెలల కాలంలో వస్తువులు, సేవల మొత్తం ఎగుమతులు 860.09 బిలియన్లకు పెరిగాయి. ఇది గతేడాది కంటే ఈ ఏడాది 4.22 శాతం మేర ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులలో ఈ ఏడాది సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం తెలిపింది. కాగా, ఈ ఏడాది వస్తువుల ఎగుమతులు 441.78 బిలియన్లకు చేరుకున్నాయి. ఇది మునుపటి ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 437.70. మొత్తంగా 0.93 శాతం పెరుగుదల ఉంది.ం

## కళ్లు మూసుకొని తెరిచేలోపు మన ప్రభుత్వం వస్తుంది



అమరావతి : " రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోంది.. దేవుడు అన్ని చూస్తున్నాడు.. కళ్లు మూసుకుని తెరిచేలోపు మన ప్రభుత్వం వస్తుంది " అని వైసిపి అధినేత వైఎస్. జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వైఎస్ జగన్ పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ... తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్లతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కృషి చేశామన్నారు. అన్ని రకాల అనుమతులతో పోర్టులను ప్రారంభించామని పేర్కొన్నారు. 2024 మార్చి 12న జువ్వలదిన్నెను వర్చువల్‌గా ప్రారంభించామని జగన్ చెప్పారు. 1250 మెకానైజ్డ్ బోట్లు అందించాలని అనుకున్నామని.. మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ బోట్లు మత్స్యకారులకు అందేవే అని చెప్పారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు కూడా 35 శాతం పూర్తి చేశామని తెలిపారు. కాకినాడ పోర్టు పనులు కూడా వేగవంతం చేశామని అన్నారు. రామాయపట్నం పోర్టు పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఏపీ ఎకనామిక్ గ్రోత్‌కు ఊతం ఇచ్చేలా ప్రణాళికలు చేశామని వివరించారు. మరి మిగిలిన పనులను కూటమి సర్కార్ ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యి రెండేళ్లు అవుతుందని.. ప్రధాని జాతికి అంకితమిచ్చి ఏడాదిన్నరకు పైగా అవుతుందని.. అయినా మత్స్యకారులు ఎందుకు అప్పగించలేదని నిలదీశారు. మత్స్యకారుల గురించి చంద్రబాబు ఏనాడూ ఆలోచించలేదని జగన్ విమర్శించారు. మత్స్యకారులకు మేలు చేయకపోగా.. వారి పొట్టపై కంతున్నారని తెలిపారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మార్చి 12న మంత్రి లోకేష్ జువ్వలదిన్నెను సందర్శిస్తే.. 16న సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని తెలిపారు. బోట్లు ఎత్తుకెళ్లిన కేసులో ఒక్కరినైనా అరెస్టు చేశారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న పెద్దలే దొంగతనం చేశారు కాబట్టే ఎవర్ని అరెస్టు చేయలేదని ఆరోపించారు. కళ్లు మూసి తెరిచేలోగా మూడేళ్లు గడిచిపోతాయని.. ఆ తర్వాత వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని జగన్ తెలిపారు. అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. జువ్వలదిన్నె మాత్రమే కాదు 10 ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల సొంతమని తెలిపారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని.. హార్బర్లను మత్స్యకారుల నుంచి ఎవరూ తీయలేరని వైఎస్.జగన్ స్పష్టం చేశారు.

## గరిట పట్టేద్దాం

వేసవి సెలవుల్లో పిల్లలకు బోలెడంత ఫ్రీ టైమ్ ఉంటుంది. చదువులకు మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలు పెంచుకునేందుకు మంచి అవకాశం. కుకింగ్, మనీ మేనేజ్‌మెంట్, క్రియేటివ్ ఆర్ట్స్, రీ సైక్లింగ్, ఫిజికల్ యాక్టివిటీస్, నేచర్ లైఫ్, గ్లోబల్ ఎక్స్‌పోజర్, వెల్‌బీయింగ్ క్లాసెస్, కమ్యూనికేషన్, డిజటల్ అండ్ టెక్నాలజీ స్కిల్స్.. ఇవన్నీ పాఠాలుగా కాకుండా వివిధ రకాల అంశాలలో అవగాహన కలిగించడానికి మేలైన సమయం. ఈ వేసవిలో పిల్లలకు వినోదాన్ని కూడా ఇచ్చే అంశాలపై నిపుణుల సూచనలతో వరుస కథనాలు. వేసవి సెలవుల్లో పిల్లలకు బోలెడంత ఫ్రీ టైమ్ ఉంటుంది. నచ్చిన ఆటలు, మెచ్చిన వినోదం.. వీటితోనే కాలక్షేపం చేయడం కాకుండా జీవన నైపుణ్యాలు పెంచుకునేందుకు మంచి అవకాశం కూడా. ఆ జాబితాలో ముందుగా వంటింట్లోకి తీసుకెళదాం. పిల్లలను కుదురుగా ఉంచేది, ఏకాగ్రతను పెంచేది, సహనాన్ని, టీమ్ వర్క్‌ని పరిచయం చేసే పాకశాస్త్రాన్ని పరిచయం చేద్దాం.. రోజూ అమ్మ చేసే వంటకు ఏదో వంక పెట్టే పిల్లలు ఉంటారు. ఒక వంట తయారు చేస్తే, మరోటి అడిగే వారూ ఉంటారు. ఇష్టమైనవన్నీ తయారుచేసి, సమయానికి బాక్స్ కట్టి ఇచ్చే అమ్మ పని తెలియాలంటే ఇదో చక్కని మార్గం కూడా. 'అమ్మో! వంటింటిని పిల్లలకు అప్పజెప్పడమా!' అని భయపడకుండా పిల్లల చేత గరిట పట్టిస్తే ఏమేం జరుగుతుందో తెలుసుకుందాం..

### రుచుల ఆస్వాదన

వంట పాత్రలు, అందుకు ఉపయోగించే వివిధ రకాల సాధనాలు ముందుగా పరిచయం అవుతాయి. ఆ తర్వాత వంట దినుసులు, కూరగాయలు, ఆకుకూరల పట్ల అవగాహన పెరుగుతుంది. వేటితో ఏ తరహా వంటకాలు తయారు చేయచ్చు, రుచులను కలపడం వంటి ప్రక్రియల్లో పాల్గొంటారు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుంది. ఒక సాధారణ పదార్థాన్ని కొత్తగా ఎలా రూ?ందించవచ్చు, అనే ఆలోచన కూడా వారిలో అభివృద్ధి చెందుతుంది. దీంట్లో భాగంగా ఇటాలియన్ , జపనీస్, కొరియన్ వంటి అంతర్జాతీయ వంటకాలనూ పరిచయం చేయవచ్చు. దీనివల్ల పిల్లల్లో ప్రపంచ సంస్కృతులపై అవగాహన పెరుగుతుంది.

### ప్రోత్సాహంతో ఆత్మవిశ్వాసం

తాము తయారు చేసిన వంటకాన్ని కుటుంబ సభ్యులు రుచి చూసి, ప్రశంసిస్తే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్న వయసులోనే 'నేను చేయగలను' అనే భావన అలవాటు అవుతుంది. ఇంట పనుల్లో తామూ భాగస్వాములు అవుతారు. వంట భారంగా కాకుండా సులభంగా చేసేలా ప్రోత్సహించవచ్చు.




### జట్టుగా విజయం

కుకింగ్ క్లాసులలో చేరితే పిల్లలు గ్రూప్స్‌గా పనిచేస్తారు. ఇది వారికి టీమ్‌వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను నేర్పిస్తుంది. ఇతరులతో కలిసి పని చేయడం, బాధ్యతలు పంచుకోవడం వంటి లక్షణాలు పెరుగుతాయి.

### సమతుల్యత సాధన

వంట సమయంలో చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి. వంటలో ఉపయోగించే పదార్థం తక్కువైతే ఎలా మార్చాలి, రుచిని ఎలా సర్దుబాటు చేయాలి... ఇవన్నీ పిల్లల్లో సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుతాయి. బ్యాలెన్స్ ఎంత అవసరమో తెలియజేస్తుంది.

### మంచి అలవాట్లు

ముఖ్యంగా వంట చేయడం ద్వారా పిల్లలు ఆహార విలువ తెలుసుకుంటారు. ఏ పదార్థం ఆరోగ్యానికి మంచిది, ఏయే పోషకాలు వేటి ద్వారా లభిస్తాయి,.. వంటి విషయాలు అర్థమవుతాయి. వృథాను అరికట్టడం, మిగిలిన పదార్థాలను తిరిగి ఎలా ఉపయోగించడం, శుభ్రతను ఎందుకు పాటించాలి.. వంటి విషయాల్లో అవగాహన కలుగుతుంది. దీంతో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఏర్పడతాయి.

### బాధ్యత పెరుగుతుంది

వంట చేయడం ద్వారా పిల్లలు స్వతంత్రంగా పని చేయడం నేర్చుకుంటారు. తమ పనిని తామే పూర్తి చేయడం, శుభ్రత పాటించడం వంటి బాధ్యతలు అలవాటు అవుతాయి. అంతేకాదు, వంట పనిలో భాగంగా వస్తువులను శుభ్రపరచడం, సర్దడం వంటి పనులూ నేర్చుకుంటారు. అదే సమయంలో గ్యాస్, ఎలక్ట్రిక్, కటర్స్.. వంటి వాడకంలో రక్షిత చర్యల గురించి అవగాహన కల్పించవచ్చు. ఇంట్లో వీలు కావడం లేదు అనుకునేవారు కుకింగ్ క్యాంప్స్‌లో చేర్పించవచ్చు. వంటల పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించవచ్చు. వంట ద్వారా కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమనూ, ఆనందాన్ని, రుచుల ఆస్వాదననూ పరిచయం చేయవచ్చు. ఇది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది కూడా.

### వంట.. వ్యక్తిత్వ వికాస పాఠం

పిల్లలు వంట నేర్చుకోవడం ద్వారా ఒక సమగ్రమైన అవగాహన కలుగుతుంది. ఒక డిష్‌ను ఎలా ప్రెజెంట్ చేయాలో తెలుస్తుంది. ప్రతి వంటకం తయారీకి పట్టే సమయం వారిలో ఆలోచనాశక్తిని, సహనాన్ని పెంచుతుంది. జంక్ ఫుడ్ ఎందుకు తీసుకోవద్దో తెలుస్తుంది. వంట అంటే ఆడవాళ్లు మాత్రమే చేసేది కాదని కుటుంబంలో అందరూ చేయవచ్చని తెలుస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎందుకు తీసుకోవాలో తెలుస్తుంది. అయితే, వంట పని ఒక భారంగా కాకుండా వినోదాత్మకంగా మార్చగలిగితే పిల్లలు జాయ్‌ఫుల్‌గా రుచుల తయారీ పట్ల దృష్టి పెడతారు. ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లల చేత వంటను ఫన్‌గా చేయించవచ్చు. ఎక్కువ మంది పిల్లలతో కలిసి పాల్గొనేలా చేయాలంటే..అందుకు కిడ్స్ కుకింగ్ క్యాంప్స్ పిల్లలకు వినోదంతో పాటు విలువైన నైపుణ్యాలనూ నేర్పిస్తున్నాయి.

## 'కాల్పుల విరమణ'కు తూట్లు!

ప్రపంచమంతా ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూసిన కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాకుండానే ముగిసిపోయే ప్రమాదం కనబడుతోంది. తీవ్ర వైషమ్యాలతో కాలుదువ్వుకునే వైరిపక్షాలు యుద్ధ క్షేత్రాన్ని విడిచిపెట్టడం అంత సులభమేమీ కాదు. అందుకే ఒప్పందం కుదిరాక కూడా అక్కడక్కడ పరస్పర దాడులు తప్పవు. కానీ పశ్చిమాసియా పరిస్థితి కాస్త భిన్నమైనది. కాల్పుల విరమణపై తొలుత అమెరికా, ఆ తర్వాత ఇరాన్ ధ్రువీకరించాక, మధ్యవర్తి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సైతం ప్రకటన చేశారు. ఎప్పుడూ లేనిది ఇజ్రాయెల్ కూడా ఒప్పందాన్ని అంగీక రిస్తున్నట్టు తెలిపింది. కానీ 24 గంటలు గడవకుండానే అందరిదీ తలోమాట అయింది. మధ్యవర్తి పాత్ర పోషించే దేశం దృఢమైన స్వరం వినిపించగలగాలి. అవసరమైతే శాసించగలగాలి. కానీ అమెరికా అప్పులపై ఆధారపడే పాక్ ఆ పని చేయగలదా? ఘర్షణలు నివారించిన ఖ్యాతిని కూడా 'త్యాగం' చేసి, తెరవెనకుండి పాకిస్తాన్ ద్వారా కథ నడిపిస్తున్న చైనా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే అమెరికా, ఇజ్రాయెల్ ఈ మాదిరి డ్రామాలకు సాహసించేవి కాదు. అసలు పశ్చిమాసియాకు సంబంధించి ఏ ఒప్పందం కుదరాలన్నా అమెరికాను సంతృప్తిపరిస్తే సరిపోదు. ఆ దేశం ఒకటి కాదు... రెండు! అవిభాజ్య కవలల మాదిరిగా వ్యవహరిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ఒప్పుకుంటే తప్ప ఏదీ సాధ్యపడదు. ఒక్కోసారి ఆ రెండూ కావాలని భిన్న స్వరాలు వినిపిస్తాయి. దీన్ని వ్యూహం అనాలో, చవకబారు ఎత్తుగడగా భావించాలో ఎవరికీ తెలియదు. అమెరికా అవునంటుంది... కాసేపటికి ఇజ్రాయెల్ కాదంటుంది. పర్యవసానంగా అనుకున్నది అమలుకాక అవతలి పక్షం అయోమయంలో పడుతుంది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ పట్టాభిషేకమయ్యాక ఆయన అల్లుడు జేరెడ్ కుష్నెర్ ద్వారా ఇజ్రాయెల్‌కు చుట్టరికం కలవడంతో పట్టపగ్గా ల్లేకుండా పోయాయి. అందుకే వైట్‌హౌస్‌లో, ట్రంప్‌కు బాగా దగ్గరగావుండే వ్యక్తుల్లో కలకలం మొదలైంది. ఇప్పుడు తోకే కుక్కను ఆడిస్తోందన్న రీతిలో వ్యవహారం ముదిరింది. కనుకనే ఒప్పందంపై తొలుత ప్రకటించిన ట్రంప్ లెబనాన్‌పై దాడులు సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. అటు తర్వాత ఒప్పందంలో లెబనాన్ ప్రస్తావన లేదని బుకాయించటం మొదలుపెట్టారు. ఇరాన్ 10 అంశాల ముసాయిదా కొత్తదేమీ కాదు. దురాక్రమణకు ముందే ఇరాన్ దాన్ని ప్రతిపాదించింది. అప్పట్లో అది ట్రంప్‌కు నచ్చలేదు. ఇక ఇరాన్ ఎంతకూ లొంగకపోవటం, చమురు ధరలు ఆకాశాన్నంటడంతో కొంపమునుగుతుందని అర్థమై అది ఆచరణయోగ్యమేనని అంగీకరించక తప్పలేదు. తన కూటమిలోని ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయరాదంటున్న ట్రంప్... ఆ దేశానికి మద్దతుగా నిలబడిన లెబనాన్‌లో మాత్రం ఇజ్రాయెల్ ఊచకోత కొనసాగించటం సబబేనంటున్నారు. ఇది మర్కట తర్కం కాదా? కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఉత్సవం చేసుకుంటున్న జనంపై పది నిమిషాలపాటు ఏకధాటిగా సాగించిన కాల్పుల్లో 250 మందికిపైగా మరణించారు. మరో 1,000 మంది గాయపడ్డారు. కాల్పుల విరమణ ప్రకటించాక అంతవరకూ 119 డాలర్లుగావున్న బ్యారెల్ ముడి చమురు ధర 94 డాలర్లకు చేరింది. కానీ ఇజ్రాయెల్ హంతక దాడులతో అదికాస్తా మళ్లీ 97కు పెరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ కపట నాటకాలు కట్టిపెడితే తప్ప ప్రపంచం ప్రశాంతంగా మనుగడ సాగించలేదు. అది జరగాలంటే ఆ రెండు దేశాల్లోని ప్రజలతో పాటు ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి తీసుకురావాలి. ప్రపంచం సంక్షోభం అంచుల్లో ఉంది. ఇరాన్ ఇప్పటికే యుద్ధంవల్ల సమస్తం కోల్పోయింది. 3,000 మంది పౌరులు మరణించగా, లక్షలాది జనావాసాలు శిథిలాలుగా మారాయి. మౌలిక సదుపాయాలన్నీ ధ్వంస మయ్యాయి. ఇరాన్ శక్తిమేరకు ప్రతీకార దాడులు చేస్తూ దురాక్రమణకు దిగిన ఆ రెండు దేశాలతోపాటు, వాటికి సహకరిస్తున్న ఇరుగు పొరుగు దేశాలను సైతం దెబ్బతీయగలిగింది. పశ్చిమాసియాలో ఇంతకుమించి మరేం జరగకూడదనుకునే దేశాలు ఇక తటస్థ అవతారాలు చాలించి నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్ని లోటుపాట్లున్నా ఈ ఒప్పందం కొనసాగేలా చూడాలి. శుక్రవారం జరిగే చర్చలు ఫలవంతం కావాలి. లేనట్టయితే చరిత్ర క్షమించదు.





## ఈ మరక పోయేదెలా?

నిరుడు మార్చిలో కోట్లాది రూపాయల కరెన్సీ కట్టలు తగలబడిన ఉదంతంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని, అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లిన ఢిల్లీ హైకోర్టు అప్పటి న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ శుక్రవారం ఎట్టకేలకు పదవి నుంచి తప్పుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రాజీనామాను ఆమోదిస్తే జస్టిస్ వర్మకు రిటైర్మెంట్ ప్రయోజ నాలు, పెన్షన్ యథావిధిగా వస్తాయి. ఈ ఉదంతం జరిగినప్పటి నుంచీ ఆయన వితండ వాదం చేశారు. కరెన్సీ కట్టలు కాలిన ఉదంతం జరిగింది న్యాయమూర్తుల నివాసప్రాంగణంలోని తన ఇంటికి వెలుపలవున్న స్టోర్ రూంలోననీ, అందరూ వచ్చిపోయే చోట ఉన్న సొమ్ము తనదేనని ఎలా చెబుతారనీ ప్రశ్నించారు. రాజీనామా చేసి నిష్క్రమించటం ఉత్తమమని సహచర న్యాయమూర్తులు చెప్పినా ఆయన అంగీకరించలేదు. అభిశంసన వరకూ వెళ్తే ఆయనతోపాటు మొత్తం న్యాయవ్యవస్థపైనే చర్చ జరుగుతుందనీ, ఇది వ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలపై ప్రభావం చూపుతుందనీ చెప్పినా ఆయన తలకెక్కలేదు. పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ మొదలైన దశలో జస్టిస్ వర్మ రాజీనామా చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలనదగ్గ మూడు వ్యవస్థలు -- కార్యనిర్వాహకవర్గం, శాసనవ్యవస్థ, న్యాయవ్యవస్థలు సమానమైనవని చెబుతారు. కానీ మన రాజ్యాంగం న్యాయవ్యవస్థకు మాత్రమే ఆ మూడింటి పరిధులనూ నిర్ణయించగల అధికారాన్నిచ్చింది. తనకు దఖలుపరిచిన బరువుబాధ్యతలకు తగ్గట్టుగా న్యాయవ్యవస్థ ఉండటంలేదన్న విమర్శలు, ఆరోపణలు చాన్నాళ్ల నుంచి ఉన్నాయి. అవి కేవలం బయటి నుంచి మాత్రమే కాదు... లోపలి నుంచీ వస్తున్నాయి. మొన్న ఫిబ్రవరి నెలాఖరున లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ జవాబిస్తూ గత పదేళ్ల కాలంలో సిట్టింగ్ జడ్జీలపై సుప్రీంకోర్టుకు 8,630 ఫిర్యాదులందాయని తెలిపింది. కానీ అతి స్వల్ప కేసుల్లో మాత్రమే అంతర్గత కమిటీల ద్వారా విచారణలు జరిగాయి. తీవ్ర ఆరోపణలొచ్చిన కేసుల్లో అనేకం కనీసం నామమాత్ర విచారణ వరకూ పోలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆరేళ్ల క్రితం కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా అప్పటి అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, న్యాయవ్యవస్థలోని అవినీతిపై గతంలో తొమ్మిదిమంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాట్లాడారనీ, వారిలో సర్వీసులో ఉండగా మాట్లాడినవారు ఇద్దరనీ ధర్మాసనానికి చెప్పారు. డబ్బు తీసుకోవటం ఒక్కటే అవినీతి అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ ఆశ్రిత పక్షపాతం, హోదా దుర్వినియోగం, విచక్షణాయుత అధికారాన్ని స్వప్రయో జనాలకు వినియోగించుకోవటం వగైరాలు సైతం దాని కిందికే వస్తాయి. రైతులకు రావాల్సిన బ్యాంకు రుణాలను ఒక చక్కెర కర్మాగారం



దారిమళ్లించి సొంతానికి వాడు కున్న కేసులో 2010లో సీబీఐ దర్యాప్తు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేసినప్పుడు అందులో జస్టిస్ వర్మ ఆ సంస్థ నాన్--ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదో నిందితుడిగా ఉన్నారు. తర్వాత కాలంలో ఆ కేసు ముందుకు సాగలేదు. ఆయనపైనా చర్యలు లేకుండా పోయాయి. ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ విశ్వహిందూ పరిషత్ సదస్సుకు పోయి మతతత్వ వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలనీ, వివరణ ఇవ్వాలనీ సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానించింది. కానీ అవేమీ జరగలేదు. గతంలో అరడజను మంది న్యాయమూర్తులపై ఆరోపణ లొచ్చాయి. వారిలో ఒకరిద్దరిపై అభిశంసన వరకూ వెళ్లింది.ద విధాన సంబంధమైనసంక్లిష్టతల వల్ల ఆ ప్రక్రియ వీగిపోయింది. కొందరు తమంత తామే రాజీనామా చేసి వెళ్లటంతో నిలిచిపోయాయి. ఇలాంటి ఉదంతాలన్నీ న్యాయవ్యవస్థ పనితీరును ప్రశ్నార్థకం చేస్తాయి. తీర్పునిచ్చే స్థానంలో ఉండటం వల్ల న్యాయమూర్తులపై దురుద్దేశంతో ఆరోపణలు చేసేవారు కూడా ఉంటారు. ఆ బెడద నుంచి వారిని కాపాడటానికి కట్టుదిట్టమైన చట్టాలు అవసరమే. కానీ అవినీతిపరులకు అవి కవచంగా ఉపయోగపడే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఫిర్యాదులను స్వీకరించి, దర్యాప్తు చేయించి నిజా నిజాలను నిర్ధారించటానికి సర్వస్వతంత్రమైన వ్యవస్థ ఒకటి అవసరం. ఆ దిశగా ప్రయత్నిస్తేనే అవినీతి జాడ్యం అంతమవుతుంది.

Postal Licence No: HDP/010/2024-2026
భారత్ BHARAT REPORTER రిపోర్టర్
తెలుగు దినపత్రిక
గురువారం - 16 - ఏప్రిల్ - 2026

# ఉద్యోగాలకు స్పేస్ టెక్ దన్ను

## 2 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన

## పరిశ్రమ అయిదు రెట్లు వృద్ధి

## 2033 నాటికి అంచనాలు



ముంబై: దేశీ ఏరోస్పేస్, డ్రోన్స్, స్పేస్ టెక్ పరిశ్రమ 2033 నాటికి అయిదు రెట్లు వృద్ధి చెందనుంది. 44 బిలియన్ డాలర్లకు చేరనుంది. అదే సమయంలో 2 లక్షలకు పైగా ఇంజనీర్లు, పరిశోధకులు, డేటా సైంటిస్టులకు ఉద్యోగావకాశాలు సృష్టించనుంది. వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా ఒక నివేదికలో ఈ అంచనాలను వెలువరించింది. 100కు పైగా క్లయింట్ల నుంచి సేకరించిన గణాంకాలకు మార్కెట్‌పై పరిశోధనల ఫలితాలను జోడించడం ద్వారా అడెకో దీన్ని రూపొందించింది. దీని ప్రకారం ప్రభుత్వ సంస్కరణలు, ప్రైవేట్ రంగం, అంతర్జాతీయ భాగస్వామ్యాల దన్నుతో పరిశోధనల ఆధారిత ధోరణి నుంచి ఏరోస్పేస్, డ్రోన్స్, స్పేస్ టెక్ పూర్తి స్థాయి పరిశ్రమగా ఎదిగింది. ఈ నేపథ్యంలో స్పేస్ పాలసీ అనలిస్టులు, రోబోటిక్స్ ఇంజనీర్లు, ఏవియోనిక్స్ స్పెషలిస్టులు, జీఎన్‌సీ (గైడెన్స్, నేవిగేషన్, కంట్రోల్) నిపుణుల్లాంటి కొత్త రకం ఉద్యోగాలు వస్తున్నాయని నివేదిక తెలిపింది. వీరంతా అంతరిక్ష రంగంలో దేశ లక్ష్యాల సాధనలో కీలకంగా నిలుస్తున్నారని వివరించింది. 'ప్రభుత్వ దార్శనికత, క్రియాశీలకమైన స్టార్టప్ వ్యవస్థ దన్నుతో భారత్ అంతర్జాతీయ స్పేస్ హబ్‌గా ఎదగనుంది. దీనితో ఇంజనీరింగ్, రీసెర్చ్, డేటా, బిజినెస్ తదితర విభాగాల్లో భారీ స్థాయిలో ఉద్యోగాలు రానున్నాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్ దీపేష్ గుప్తా తెలిపారు. నివేదికలో మరిన్ని విశేషాలు..

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణేలాంటి ప్రాంతాల్లో అత్యధికంగా అవకాశాలు రానున్నాయి. ఏవియోనిక్స్, క్రయోజెనిక్స్, ఏటీడీసీ (యాటిట్యూడ్ డిటర్మినేషన్, కంట్రోల్ సిస్టమ్స్), రిమోట్ సెన్సింగ్ నిపుణులు, స్పేస్ హ్యాబిటాట్ ఇంజనీర్లకు భారీ వేతనాలు లభించనున్నాయి. సాధారణ టెక్నికల్ ఉద్యోగులతో పోలిస్తే 20–30% అధికంగా ఉండనున్నాయి. భారతీయ అంతరిక్ష పాలసీ 2023 లాంటి సంస్కరణలు, 250 పైచిలుకు స్పేస్ స్టార్టప్‌లు, ఇన్–స్పేస్ కింద రూ. 1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ మొదలైనవి ఈ పరిశ్రమ వృద్ధికి దన్నుగా నిలుస్తాయి. కొత్త ఆవిష్కరణలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు తోడ్పడనున్నాయి. అంతరిక్ష రంగంలో సిబ్బందిపరంగా వైవిధ్యం పెరగనుంది. ఇస్రో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం (యువికా), విజ్ఞాన్ జ్యోతి ప్రోగ్రాం, సమృద్ధ్ లాంటి స్కీములతో ఎంట్రప్రెన్యూర్‌షిప్, సాంకేతిక, పరిశోధన విభాగాల్లోకి వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గగన్‌యాన్ మిషన్, యాక్సియోమ్–4 ఐఎస్ఎస్ ప్రోగ్రాంలో భారత్ భాగం కావడం, సొంత స్పేస్ స్టేషన్ నిర్మాణంపై కసరత్తు చేస్తుండటం మొదలైన వాటి వల్ల ఆయా రంగాల్లో ప్రతిభావంతులకు డిమాండ్ మరింతగా పెరగనుంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్పేస్ ఎకానమీలో భారత్ వాటా సుమారు 2 శాతంగా ఉంది. 2033 నాటికి 11 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పాటు తన మార్కెట్‌ను 44 బిలియన్ డాలర్లకు పెంచుకోవడంపై భారత్ దృష్టి పెడుతోంది. తద్వారా గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 7%--%8% వాటాను సాధించాలని నిర్దేశించుకుంది.

# ఐటీ కంపెనీలు లాభాల బాట పట్టాలంటే!

టెక్ దిగ్గజాల దృష్టి అంతా ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పైనే ఉంది. లాభాలు స్థిరంగా ఉన్నా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జెనరేటివ్ ఏఐపై కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల ఓపెన్ ఏఐతో ఒప్పందం చేసుకుని 300 బిలియన్ల పెట్టుబడులు పెట్టినప్పుడు ఒరాకిల్ స్టాక్‌ప్రైస్ 335 డాలర్లకు పెరిగింది. ఆ తరువాత రెండు మూడు నెలల్లోనే 190 కంటే దిగువకు పడిపోయింది. అయితే ఈ విభాగంలో పెట్టుబడులు లాభాలుగా మారడానికి ఎంత సమయం పడుతుంది? ఈ టెక్నాలజీని లాభసాటిగా మార్చుకోవాలంటే కంపెనీలు ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి? స్థిరమైన లాభాల కోసం ఐటీ కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎలా అధిగమించాలో విశ్లేషిద్దాం.

### ఏఐ పెట్టుబడులు

టెక్ దిగ్గజాలు ఏఐ పరిశోధన, మౌలిక సదుపాయాలపై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ పెట్టుబడులు తక్షణమే కాకుండా, దీర్ఘకాలంలో మాత్రమే ఫలితాలనిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పెట్టుబడుల నుంచి గరిష్ట లాభాలను పొందడానికి కంపెనీలు కొన్ని కీలక అంశాలపై దృష్టి సారించాలి. కేవలం ఏఐ టెక్నాలజీని అభివృద్ధి చేయకుండా నిర్దిష్ట వ్యాపార సమస్యలను పరిష్కరించే సర్వీసులను పెంచాల్సి ఉంటుంది. ఉదాహరణకు: కస్టమర్ సేవల్లో ఆటోమేషన్, కోడ్ డెవలప్‌మెంట్ వేగవంతం చేయడం, లేదా కచ్చితమైన డేటా అనలిటిక్స్ అందించడం వంటి విభిన్న సర్వీసులపై దృష్టి సారించాలి. ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, తయారీ వంటి నిర్దిష్ట పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో సర్వీసులను అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంటుంది.

### వ్యూహాత్మక భాగస్వామ్యాలు

ఐటీ కంపెనీలు స్టార్టప్‌లతో సహకారం కలిగి ఉంటూ తమ సొంత ఆర్ అండ్ డీపైనే ఆధారపడకుండా వినూత్న ఏఐ స్టార్టప్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకోవాలి లేదా వాటిని కొనుగోలు చేయడం ద్వారా టెక్నాలజీని త్వరగా మార్కెట్‌లోకి తీసుకురావచ్చు. క్లయింట్‌లతో కలిసి పనిచేస్తూ వారి వ్యాపార ప్రక్రియల్లో ఏఐని ఏకీకృతం చేయడం ద్వారా ఆయా ప్రాజెక్టుల నుంచి నిరంతర ఆదాయాన్ని పొందవచ్చు.

### మానిటైజేషన్ మోడల్స్

ఏఐ ఆధారిత టూల్స్‌కు నెలవారీ లేదా వార్షిక సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను అమలు చేయాలి. క్లయింట్ ఏఐ సర్వీసును ఎంత ఉపయోగించారో దాని ఆధారంగా ధరను నిర్ణయించడం ద్వారా తక్కువ వినియోగం ఉన్న క్లయింట్‌లను కూడా ఆకర్షించవచ్చు. మానవ వనరుల పెంపు ఏఐ టెక్నాలజీని ఉపయోగించే, దాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం ఉన్న ఉద్యోగుల శిక్షణలో పెట్టుబడి పెట్టాలి. దానివల్ల ఏఐ ప్రాజెక్టుల అమలు వేగం, నాణ్యత పెరుగుతుంది.

### ఐటీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు

ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా క్లయింట్ కంపెనీలు టెక్ ఖర్చులను




తగ్గించుకుంటున్నాయి. దీంతో ఐటీ సేవలకు డిమాండ్‌లో ఒడుదొడుకులు కనిపిస్తున్నాయి. ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలలో నిపుణులైన ఉద్యోగులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నైపుణ్యాల కొరత ప్రాజెక్టుల వేగాన్ని తగ్గిస్తోంది. జెనరేటివ్ ఏఐ టూల్స్ కొన్ని సంప్రదాయ ఐటీ పనులను (ఉదా: ప్రాథమిక కోడింగ్, టెస్టింగ్) ఆటోమేట్ చేయగలవు. ఇది ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రస్తుత వ్యాపార నమూనాకు సవాలుగా మారుతోంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వేగవంతం కావడంతో సైబర్ దాడుల ప్రమాదం పెరుగుతోంది. భద్రతకు సంబంధించిన వ్యయం అధికమవుతోంది. పోటీ పెరగడం, క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవాలని చూడడంతో ఐటీ సేవలకు ధరలను తగ్గించాల్సిన ఒత్తిడి కంపెనీలపై పెరుగుతోంది.

### సవాళ్లు అధిగమించాలంటే..

పైన పేర్కొన్న సవాళ్లను అధిగమించి లాభాల వృద్ధిని కొనసాగించడానికి ఐటీ కంపెనీలు కొన్ని మార్గాలను అనుసరించాలి. అంతర్గత ప్రక్రియల్లో, క్లయింట్ ప్రాజెక్టుల్లో ఆటోమేషన్ ఉపయోగించడం ద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించాలి. తక్కువ నిర్వహణ ఖర్చులు ఉన్న ప్రాంతాల నుంచి సేవలు అందించే మోడల్‌ను బలోపేతం చేయాలి. పాత నైపుణ్యాలు గల ఉద్యోగులను ఏఐ, క్లౌడ్, డేటా సైన్స్ వంటి భవిష్యత్తు టెక్నాలజీలలోకి తిరిగి శిక్షణ ఇవ్వాలి. దీని ద్వారా నైపుణ్యాల కొరతను అధిగమించవచ్చు. ఉద్యోగులకు ఏఐ ఫస్ట్ ఆలోచనా విధానాన్ని అలవాటు చేయాలి.

# పెద్దవారికీ కావాలి జి.పి.ఎస్

## సంరక్షణ



మతిమరుపు, అల్జైమర్స్, మనస్తాపం, ప్రమాదాలు... ఇంట్లో పెద్దవాళ్లు కనపడకుండా పోవడానికి ఎన్నో కారణాలు. వారిని పట్టుకోవడం ఎలా? రెండు రోజుల క్రితం ముంబైలో 79 ఏళ్ల వృద్ధురాలు కనపడకుండా పోతే మనవడు ఆమె మెడ గొలుసులో బిగించిన జి.పి.ఎస్.ను యాక్టివేట్ చేసి ఆమెఅ దాపున ఉన్న ఆస్పత్రిలో స్పృహ లేకుండా పడి ఉందని తెలుసుకున్నాడు. వయో వృద్ధులు తప్పి పోతే వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి మార్కెట్లో జి.పి.ఎస్. ట్రాకర్లు ఉన్నాయి. రోజులు బాగలేని ఈ కాలంలో వీటి అవసరం ఎక్కువగా ఉంది. ముంబయికి చెందిన 79 ఏళ్ల సైరాబీ ఇటీవల ఒకరోజు ఈవెనింగ్ వాక్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అలా వెళ్లిన మనిషి తిరిగి రాలేదు. ఏమయ్యారో తెలీదు. చుట్టుపక్కలప్రాంతాలు వెతికినా కనిపించలేదు. సైరాబీని ఓ బైక్ గుద్దేయడంతో ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఒంటరిగా బయటకు వచ్చిన ఆమె వివరాలు అక్కడున్న ఎవరికీ తెలియలేదు. అయితే ఆమె ఆచూకీ ఎక్కుడుందో ఇంటి వారిని పట్టిచ్చింది ఆమె మెడలో ధరించిన నెక్లెస్‌లోని జీపీఎస్.

### మనవడి ముందు చూపు

వయసులో పెద్దవారు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోతే ఆందోళనగానే ఉంటుంది. మార్గమధ్యంలో వారికేమైందని కలవరం మొదలవుతుంది. సైరాబీ ఇంట్లో అదే పరిస్థితి నెలకొంది. అయితే ఆమె మనవడు మహమ్మద్ వసీం ఆమె వేసుకున్న నెక్లెస్‌లో రహస్యంగా జీపీఎస్ ట్రాకర్ ఇన్ స్టాల్ చేశాడన్న విషయం ఎవరికీ తెలియదు. వృద్ధులు రకరకాల కారణాల వల్ల ఇల్లు విడిచి పెట్టి వెళుతుంటారు. లేదా దారి తప్పుతుంటారు. అందుకే మనవడు ముందు చూపుతో ట్రాకర్ అమర్చాడు. ఆ పని మేలు చేసింది. మనవడు వెంటనే ట్రాకర్ స్విచ్ ఆన్ చేయగా, వారింటికి 5 కి.మీల దూరంలో ఉన్న కేఈఎమ్ ఆసుపత్రిని చూపించింది. దీంతో వెంటనే కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమె తలకు గాయమైందని, ఆరోగ్యం కుదురుగా ఉందని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఇలా నిత్యం అనేకమంది వృద్ధులు తప్పిపోయి ఆచూకీకి దూరమవుతున్నారు. అటువంటి వారికి జీపీఎస్ ట్రాకర్ మేలు చేస్తోంది.

### నెక్లెస్ జీపీఎస్ ట్రాకర్

'నెక్లెస్ జీపీఎస్ ట్రాకర్' ఇటీవల కాలంలో అనేకమందికి చేరువైంది. నగలకుండే లాకెట్‌ల లోపల ఇమడ్చగలిగే ఈ చిన్న పరికరం మనం ఎక్కడున్నది, ఎక్కడికి వెళు తున్నది స్మార్ట్ ఫోన్ ద్వారా ట్రాక్ చేస్తుంది. పైకి మామూలు నగలలాగే కనిపిస్తూ ఉండటం వల్ల అలంకరణకూ లోటూ ఉండదు. ఒంటరిగా బయటకు వెళ్లే మహిళలు, చిన్నారులు, వృద్ధులు, మతిమరుపు కలిగినవారు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలున్న వారికి ఇది చాలా ఉపకరించే పరికరం. వాళ్లు ఎక్కడైనా తప్పిపోయినా, జరగరానిది జరిగినా, అపహరణకు గురైనా వెంటనే ఆచూకీ తెలుసుకోవచ్చు. ఒంటరిగా దూరప్రయాణాలు చేసేవారు, అడవి, కొండలు, ఎడారులు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పిపోకుండా వీటిని వినియోగించొచ్చు. ఏదైనా నేరాలు జరిగినా, అనుకోని ఘటనలు జరిగినప్పుడు సాక్ష్యాలుగా ఇవి పోలీసుశాఖకు మేలు చేయనున్నాయి.

### ధరలు అందుబాటులోనే..

జీపీఎస్ ట్రాకర్ నెక్లెస్ ధరలు అందుబాటులోనే ఉంటాయి. బేసిక్ ట్రాకింగ్ నెక్లెస్ కనీస ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల దాకా ఉంటుంది. మధ్యస్థ స్థాయిలో రూ.6 వేల నుంచి రూ.10 వేల దాకా ఉంటుంది. ఎక్కువ ఆప్షన్స్ ఉన్న హైఎండ్ ట్రాకర్ కావాలంటే రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# టెక్నా'లేజీ'.. అతివినియోగంతో తగ్గుతున్న జ్ఞాపకశక్తి

టెక్నాలజీ.. కాస్త టెక్నా'లేజీ' అవుతోంది.. పాశ్చాత్య నాగరికతకనుగుణంగా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. వయో భేదంలేదు అసలేలేదు.. అరచేతిలో స్వర్గం.. అనర్థాలు అధికమన్న విషయం తెలిసినా సామాజిక మాధ్యమాల్లోనే కాలం గడిపేవారి సంఖ్య పెరిగిపోతోంది.. అతివినియోగంతో జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది.. అన్ని వయసుల వారిలోనూ ఆరోగ్య సమస్యలూ పెరిగిపోతున్నాయి.. ఫలితంగా చిన్నారులేకాదు.. 15 నుంచి 32 ఏళ్ల యువత కూడా డేంజర్ జోన్‌లోకి వెళ్లిపోతోంది..

పుట్టపర్తి: ప్రపంచీకరణ నేపథ్యంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. గత మూడు దశాబ్దాలతో పోలిస్తే.. టెక్నాలజీ అభివృద్ధి, తద్వారా ప్రజలకు అందిన మేలు ఊహలకు అందదు. చావు కబురు చెప్పాలంటే టెలిగ్రామ్ పంపే రోజుల నుంచి నిమిషాల్లో సమాచారం చేరవేసే సాంకేతిక పరిజ్ఞానం వచ్చింది. బంధువులను పండుగలు, శుభకార్యాల్లో మాత్రమే కలిసి రోజుల నుంచి నిత్యం టచ్‌లో ఉండేలా టెక్నాలజీ అందిపుచ్చుకున్నారు. మధ్య మధ్యలో మంచీచెడులు తెలుసుకోవాలంటే ఉత్తరాలే దిక్కయ్యేవి. ఆ దశ నుంచి కంప్యూటర్, ఇంటర్నెట్ యుగంలోకి వచ్చాం. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సగటున స్మార్ట్‌ఫోన్ ఉంది. ఇంటింటా స్మార్ట్ టీవీలు ఉన్నాయి. ఇంటర్నెట్ ద్వారా ఇంట్లో నుంచి ప్రపంచాన్ని చూసే అవకాశం లభిస్తోంది. ఏ సమాచారం కావాలన్నా గూగుల్‌లో దొరుకుతోంది. పండుగలు, శుభకార్యాల కోసం మంచి బ్రాండ్ దుస్తులతో సహా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా కొంటున్నారు. వ్యాపార రంగంలో ఆన్‌లైన్ బిజినెట్ వాటా సుమారు సగం పైగా ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా పిల్లల వీడియో గేమ్స్ యాప్స్ రూపంలో మొబైల్స్, టీవీల్లో వస్తున్నాయి. టెక్నాలజీ వినియోగించకుండా రోజు గడవని స్థితి నెలకొంది. ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా.. గూగుల్ మ్యాప్‌లో వెతుక్కుని వెళ్లే స్థితికి వచ్చారు.

ఇదంతా పక్కన బెడితే.. మరో కోణంలో టెక్నాలజీని అతిగా వినియోగించి అనారోగ్యం బారిన పడేవారి సంఖ్య కూడా పెరిగిపోతోంది. అలాంటి వారిలో 15 - 35 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. టెక్నాలజీ ప్రభావంతో చదువులో వెనుకబడడం, క్రమశిక్షణ లేకపోవడం, దేనిపైనా దృష్టి సారించలేకపోవడం, ఒకరినొకరు మాట్లాడడం తగ్గిపోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఊబకాయం సమస్యలు పెరుగుతున్నాయి. నిద్రలేమి వేధిస్తోంది. చిన్న విషయానికి కూడా కోపం తెచ్చుకోవడం వంటి ప్రభావాలు పడుతున్నాయి. ఆఖరుకు చిన్న పిల్లలు కూడా డేంజర్ జోన్‌లోకి వెళ్తున్నారని వైద్యనిపుణులు చెప్తున్నారు.

ఒకే ప్రదేశంలో కూర్చొని కంప్యూటర్ చూస్తూ గడిపే వారికి వెన్ను సమస్యలు అధికం అవుతున్నాయి. ఈ నొప్పితో ఇతర విషయాలపై దృష్టి సారించలేకపోతున్నారు. నిత్యం ఉద్యోగ ఒత్తిళ్లతో బిజీలో ఉండటంతో పాటు మధ్య మధ్యలో స్నేహితులతో ముచ్చటించటం.. పలు విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తితో కంప్యూటర్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు.. ఫలితంగా మూడు పదుల వయసుకే వెన్నెముక బారిన పడుతున్నారు. ఇటీవల పుట్టపర్తిలో 36 ఏళ్ల వ్యక్తి వెన్నెముక నొప్పి బారిన పడడమే నిదర్శనంగా చెప్పవచ్చు. స్మార్ట్‌ఫోన్లతో జ్ఞాపకశక్తి కోల్పోతున్నారు. కనీసం కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు కూడా గుర్తు పెట్టుకోలేని పరిస్థితి. గణాంకాల విషయానికొస్తే క్యాలిక్యులేటర్ వాడుతున్నారు.

ప్రైమరీ పాఠశాల నుంచి చిన్నారులు స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడటంతో ఏ విషయం గుర్తుంచుకోలేకపోతున్నారు. ఫోన్ లేకుంటే ఏ పనీ చేయలేని స్థితిలోకి వెళ్తున్నారు. ఫలితంగా టీనేజీలోనే జ్ఞాపక శక్తి కోల్పోతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. రెండు నెలల క్రితం హిందూపురంలో 16 ఏళ్ల బాలుడు జాపకశక్తి కోల్పోయి.. మానసికంగా దెబ్బ తిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. పండుగ వచ్చినా.. ఫంక్షన్ రోజయినా.. ఎలాంటి శుభకార్యం కోసమైనా.. నేరుగా వెళ్లి పిలిచే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. సమీప బంధువులను తప్ప మిగతా అందరినీ టెక్నాలజీ ఆధారంగా ఆహ్వానిస్తున్నారు. శుభవార్త, చేదువార్తలు కూడా సామాజిక మాధ్యమాల ద్వారానే తెలియజేస్తున్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఒక్కరూ అర్ధరాత్రి వరకు ఫోన్‌లతోనే గడిపేస్తున్నారు. మెసేజీలు, ఫోన్ కాల్స్, రీల్స్‌కు బానిసలుగా మారారు.

### పెరిగిపోతున్న ఒత్తిడి..

స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్‌తోనే టెక్నాలజీని విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా చిన్నపిల్లలు, యువతకు ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని వైద్యులు చెప్తున్నారు. 40 ఏళ్ల లోపు వయసున్న వారికి టెక్నాలజీ అతి వినియోగం కారణంగా మానసిక, శారీరక సమస్యలు అధికమయ్యాయి. యువత ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమయం గడుపుతుండడంతో సాధారణం కంటే ఐదు రెట్లు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. స్మార్ట్‌ఫోన్ తక్కువగా వాడేవారు పాజిటివ్ ధోరణితో ఉండగా.. అతిగా వినియోగించే వారు నెగిటివ్ ఆలోచనలో ఉంటారని నిపుణులు చెప్తున్నారు. ట్యాబ్‌లు, కంప్యూటర్లపై ఎక్కువగా ఆధారపడేవారు కంటి సమస్యతో బాధపడుతున్నారు. ఇంకొంత మందికి తలనొప్పి, భుజం, వెన్నునొప్పి సమస్యలు వస్తున్నాయి.

### ఆరోగ్యం ప్రధానం

నిద్రపోయే గంట ముందే స్మార్ట్‌ఫోన్ వాడకం, టీవీ చూడటం మానేయాలి. అతి దగ్గరగా కూర్చొని టీవీ, ఫోన్ కూడా చూడరాదు. టెక్నాలజీని అవసరం మేరకే వాడుకోవాలి. లేదంటే సోమరితనం పెరిగిపోతుంది. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల వాడకం పూర్తిగా తగ్గించాలి. స్మార్ట్‌ఫోన్లలో పిల్లలు ఏం చేస్తున్నారనే విషయం గమనించడం తల్లిదండ్రుల బాధ్యత. లేదంటే పెడదారిలో వెళ్లే అవకాశం అధికంగా ఉంటుంది.



# నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా!



బాలీవుడ్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం -రామాయణ్-. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న పౌరాణిక గాథపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా సినిమాలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటిస్తుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌లో రణబీర్‌ను రాముడి గెటప్‌లో చూసిన నటి సురభి దాస్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. - అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట! సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సురభి దాస్ షూటింగ్ సెట్‌లో రణబీర్ కపూర్‌ను చూసిన మొదటి క్షణాన్ని గుర్తు చేసుకున్నారు. రణబీర్ రాముడి గెటప్‌లో నడుచుకుంటూ వస్తుంటే ఒక్క క్షణం తాను తన కళ్ళను తానే నమ్మలేకపోయానని వెల్లడించారు. -నిజంగా ఆ శ్రీరాముడే సాక్షాత్తు భూమి మీదకు దిగి వచ్చాడా అన్నంత గొప్పగా రణబీర్ ఆహార్యం ఉందని మనసులో అనుకున్నాను. ఆయన కళ్ళలో ప్రశాంతత, గంభీరమైన రూపం చూసి తాను మంత్రముగ్ధురాలినయ్యానని పేర్కొన్నారు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి? రణబీర్ కపూర్ ఈ పాత్ర కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. కేవలం బాహ్యరూపం మాత్రమే కాకుండా? శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆకళింపు చేసుకోవడానికి మాంసాహారాన్ని మానేసి, మద్యానికి దూరంగా ఉంటూ కఠినమైన నియమాలు పాటిస్తున్నారు. ఈ క్రమశిక్షణే ఆయన ముఖంలో ప్రత్యేకమైన తేజస్సును తీసుకువచ్చిందని, అది సెట్‌లోని అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని సురభి వ్యాఖ్యానించారు. నటుడిగా రణబీర్ తనను తాను మలుచుకున్న తీరు అద్భుతమని ఆమె కొనియాడారు. - టెక్ గురూ సంచలనం: టాలీవుడ్ నిర్మాతలు భయపడుతున్నారు! దర్శకుడు నితేష్ తివారీ ఈ చిత్రంలోని ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని అత్యంత సహజంగా, భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ , సెట్స్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రామాయణ్ రూపొందుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో లీక్ అయిన కొన్ని ఫోటోలు రణబీర్ లుక్‌పై పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేయగా తాజాగా సురభి దాస్ చెప్పిన విషయాలు అభిమానుల్లో ఉత్కంఠను మరింత పెంచాయి. శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తోన్న ఈ సినిమా భారతీయ సినీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. - ఇష్టమైన ప్లాట్ ను పైలెట్ కు అద్దెకు ఇచ్చిన హీరో! ఒక నటుడు తన పాత్రలో ఎంతగా లీనమైతే సెట్‌లోని తోటి నటీనటులు కూడా అంతటి ఆశ్చర్యానికి లోనవుతారో చెప్పడానికి సురభి దాస్ మాటలే నిదర్శనం. అలాగే సినిమాలో రణబీర్ కపూర్ - సాయి పల్లవిల మధ్య కెమిస్ట్రీ కూడా అద్భుతంగా పండనుందని సురభి దాస్ హింట్ ఇచ్చారు. వీరిద్దరూ ఆయా పాత్రల కోసం ప్రాణం పెట్టి నటిస్తున్నారని, సెట్‌లో వారి మధ్య జరిగే సంభాషణలు మరియు భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఒక సరికొత్త లోకానికి తీసుకెళ్తాయని

# అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట!

**ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా..**

**నటుడిగా కూడా దక్షిణాదిన బిజీగా మారుతున్నారు.**



టాలీవుడ్‌లో -సీతారామం-, -హాయ్ నాన్న- వంటి సినిమాలతో పద్ధతిగా.. సున్నితంగా కనిపించే పాత్రలకే పరిమితమైన మృణాల్ ఠాకూర్‌ను భవిష్యత్తులో అత్యంత క్రూరమైన- తీవ్రమైన పాత్రలో చూపించబోతున్నట్లు ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ హింట్ ఇచ్చారు. మృణాల్ కోసం ఒక సరికొత్త.. అసాధారణమైన కథాంశం తన దగ్గర ఉందని ఈ నటిలోని నటనను మరో కోణంలో ఆవిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు సరదాగా --మృణాల్ కెరీర్‌ను అనురాగ్ మార్చేయబోతున్నారు-- అంటూ కామెంట్స్ చేస్తున్నారు.- రెండేళ్ల వరకూ కెప్టెన్ కుర్చీకి దూరంగా!ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా.. నటుడిగా కూడా దక్షిణాదిన బిజీగా మారుతున్నారు. ఇటీవల విడుదలైన -డెకాయిట్- చిత్రంలో అతడి రియలిస్టిక్ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దక్షిణాదిన ఆయన పోషించిన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగులో కూడా ఆయనకు క్రేజ్ పెరుగుతుండటంతో టాలీవుడ్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో ఆయన భాగం కాబోతున్నారని సమాచారం. ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాల్లో అతడి విలక్షణమైన బాడీ లాంగ్వేజ్‌కు దర్శకులు ప్రాధాన్యతనిస్తున్నారు. - నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా! దక్షిణాదిన తమిళ చిత్ర పరిశ్రమలో కూడా అనురాగ్ కశ్యప్ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే విజయ్ సేతుపతి -మహారాజా- వంటి చిత్రాల్లో విలన్‌గా మెప్పించిన ఆయన మరికొన్ని భారీ తమిళ సినిమాల్లో కీలక పాత్రలకు సంతకం చేశారు. అలాగే మలయాళ చిత్రాల్లోనూ ఆయన ప్రవేశం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఒకవైపు బాలీవుడ్‌లో కల్ట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూనే మరోవైపు సౌత్ సినిమాల్లో నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను అద్భుతంగా కొనసాగిస్తున్నారు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి? ఇక మృణాల్ ఠాకూర్ కెరీర్ విషయానికి వస్తే... ఈ ట్యాలెంటెడ్ బ్యూటీ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. తెలుగులో నాని, విజయ్ దేవరకొండ వంటి హీరోలతో నటించిన తర్వాత ఇప్పుడు బాలీవుడ్ - సౌత్ మధ్య బ్యాలెన్స్ చేస్తోంది. ఇటీవల దేవగన్ సరసన నటించిన -సన్ ఆఫ్ సర్దార్ 2- కూడా విడుదలైంది. కొన్ని తమిళ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. నటనకు ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన పాత్రలను మృణాల్ ఎంచుకుంటోంది. - టెక్ గురూ సంచలనం: టాలీవుడ్ నిర్మాతలు భయపడుతున్నారు! మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత బిజీ దశలో ఉంది, ఆమె చేతిలో వైవిధ్యమైన హిందీ ప్రాజెక్టులు ఉన్నాయి. వరుణ్ ధావన్ సరసన డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -హై జవానీ తో ఇష్క్ హోనా హై- ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉండగా.. ఇందులో సరికొత్త గ్లామరస్ రోల్‌లో కనిపించబోతోంది. అలాగే ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ -పూజా మేరీ జాన్- ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ఇందులో మృణాల్ టైటిల్ పాత్రను పోషిస్తోంది. వీటితో పాటు 2027లో విడుదలకు సిద్ధమవుతున్న -రాకా- అనే భారీ ప్రాజెక్టులో బన్నీతో కలిసి నటిస్తోంది. ఈ భారీ చిత్రాలు మృణాల్ ను గ్లామ్ బిజ్ లో మరింత సుస్థిరమైన స్థానంలో నిలబెడతాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అంతేకాదు... అనురాగ్ కశ్యప్ వంటి దర్శకుడు మృణాల్‌ను -బ్రూటల్-గా చూపిస్తానంటే తన కెరీర్‌లో అదొక మేలిమలుపు కావడం ఖాయం. ఒక క్లాసిక్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న మృణాల్..అనురాగ్ ప్రపంచంలో క్రూరమైన పాత్రలో ఎలా ఒదిగిపోతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కాంబినేషన్ సెట్స్ పైకి వెళ్తే వినోద రంగంలో అది మరో సంచలనమే అవుతుంది.

## ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో

# యానిమేషన్ బాహుబలి

భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి




రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# సంక్రాంతికి సీనియర్ హీరోల మధ్య వార్!

## మరోవైపు నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్ కూడా సంక్రాంతి రేసులోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది.



2027 సంక్రాంతి సీజన్ రిలీజ్ డేట్లపై అప్పుడే కర్చీఫ్ వేయడం మొదలైంది. సినిమా ప్రారంభానికి ముందే సంక్రాంతి రిలీజ్ అంటూ పోస్టర్లు వేసి మరీ డేట్లు లాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ హీరోలు కూడా ఎక్కడా తగ్గడం లేదనిపిస్తోంది. ఒకరికొకరు పోటీగా బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. మరోసారి సీనియర్ స్టార్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున దశాబ్దాల తర్వాత ఒకేసారి బాక్సాఫీస్ బరిలో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నలుగురు దిగ్గజాలు తమ ప్రాజెక్టులతో పొంగల్ బెర్తులు ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే.. - నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా! వెంకటేష్ - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇద్దరి కలయికలో హ్యాట్రిక్ చిత్రమిది. ఎఫ్ 2, ఎఫ్ 3 వంటి విజయాల తర్వాత వస్తోన్న చిత్రమిది. ఇందులో కల్యాణ్ రామ్ కూడా ఓ హీరోగా నటిస్తుండటంతో మల్టీస్టారర్ గా మారింది.

ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే జనవరి 15ని విడుదల తేదీగా ప్రకటించారు. ఆరకంగా సంక్రాంతి రేసులో తాము ముందే ఉన్నామని సంకేతాలు ఇచ్చారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ అనిల్ రావిపూడి మార్కు వినోదంతో ఈ చిత్రం రాబోతుండటం వెంకటేష్‌కు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. - అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట! మెగాస్టార్ చిరంజీవి కూడా వాల్తేరు వీరయ్య సెంటిమెంట్‌ను రిపీట్ చేసేందుకు సిద్ధమయ్యారు. బాబి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తోన్న కొత్త సినిమాను సంక్రాంతి కానుకగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు పట్టుదలతో ఉన్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా సంక్రాంతి విజేతగా నిలవడంతో, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని మెగా ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

మాస్ ఎలిమెంట్లతో కూడిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయం చెప్పొచ్చు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి మరోవైపు నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్ కూడా సంక్రాంతి రేసులోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి గత చిత్రం వీరసింహారెడ్డి సంక్రాంతికి విడుదలై బాలయ్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. దీంతో మరోసారి అదే మాస్ కాంబో రిపీట్ అవుతుండటంతో థియేటర్ల వద్ద పోటీ రసవత్తరంగా మారనుంది. బాలయ్య మార్కు డైలాగులు, గోపీచంద్ టేకింగ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. స

అలాగే కింగ్ నాగార్జున కూడా సరైన కథతో రేసులో నిలుస్తున్నారు. 101వ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసే ప్లాన్ లో ఉన్నారు. ఇలా ఈ సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద నలుగురు సీనియర్ల మధ్య క్లాష్ ఆఫ్ ది టైటాన్స్ తప్పదనిపిస్తుంది ఒకే సీజన్‌లో నలుగురు సీనియర్ హీరోలు రావడం వల్ల బాక్సాఫీస్ వద్ద వసూళ్లు బాగానే ఉంటాయి. కానీ థియేటర్ల సర్దుబాటు అనేది పెద్ద సవాలుగా మారుతుంది.

అభిమానుల మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగే పోటీ మరోస్థాయిలో ఉంటుంది. అభిమానుల మధ్య వైరాలకు ఇలాంటి పోటా పోటీ రిలీజ్ లు కల్పిస్తుంటాయి.

# వారణాసి కోసం దేవర సెట్స్ ?

సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది






నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.







# టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు

నటుడు యశ్ ఆసక్తికర విషయం వెల్లడి

భిన్న నేపథ్యాలున్న కథలతో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు యశ్. ప్రస్తుతం నితీశ్ తివారీ




దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లోనటిస్తున్నారు. దీనితో పాటు.. గీతూ మోహన్ దాస్ డైరెక్షన్‌లో 'టాక్సిక్' చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్' టీజర్ చూసి అందరూ ఇది గ్యాంగ్‌స్టర్ సినిమా అనుకుంటున్నారని కానీ, ఇది అలాంటి చిత్రం కాదని స్పష్టం చేశారు. జూన్ 4న విడుదల కానున్న 'టాక్సిక్' గురించి యశ్ మాట్లాడుతూ.. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ సినిమా కాదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. భిన్నమైన ప్రపంచం.. కొత్త కథాంశంతో రానుంది. ఆకట్టుకునే విజువల్స్ ఉన్నాయి. మొదటిసారి ఒక సినిమాను ఇంగ్లిష్‌లో కూడా తెరకెక్కిస్తున్నారు. టీమ్ అంతా ఎంతో ఉత్సాహంగా పని చేస్తోంది. నా అభిమానులు నా నుంచి ఏం ఆశిస్తున్నారో నాకు తెలుసు. అందుకే ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కచ్చితంగా ఇది మిమ్మల్ని అలరిస్తుంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో పనిచేయడం చాలా గొప్ప అనుభవం. సినిమాపై స్పష్టమైన విజన్‌తో ఉన్నారు. యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని చెప్పారు. ఇక 'రామాయణ' మొదటి భాగం గురించి యశ్ పంచుకున్నారు. 'రణ్‌బీర్ అద్భుతమైన నటుడు. సినిమా విషయంలో మా ఇద్దరి విజన్, ఆలోచనలు ఒకేలా ఉన్నాయి. అది ఈ ప్రాజెక్ట్‌కి చాలా కలిసొచ్చింది. రామాయణ పార్ట్ 1లో మా ఇద్దరి కాంబినేషన్‌లో సీన్స్ లేవు' అని తెలిపారు. రణ్‌బీర్ రాముడిగా కనిపించనున్న ఈ 'రామాయణ'లో యశ్ రావణుడిగా నటిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రం విడుదల కానుంది.




Editor,Printer,Publisher,Owner By:Kotlapalli Fouziya,Printed At by M/s Fouziya Publication,Door No:26-4-1273/3
,Melapuram,Hindupur.Sri Sathya Sai district, Andrapradesh -515201, bharathreporter@gmail.com,Cell: 9059679786 RNI No.APTEL/ 2023/88573.